ప్రజాశక్తి
కడప

సోమవారం
జనవరి- 1
2018
పేజీలు : 12



ఉక్కు పరిశ్రమ, ప్రాజెక్టుల పూర్తి కోసం

పోరాటాలు

బిజెపి , టిడిపిలు ద్రోహం చేస్తున్నాయి

సిపిఎం జిల్లా కార్యదర్శి
కె.ఆంజనేయులు

5లో

రోడ్డు ప్రమాదంలో

ముగ్గురు దుర్మరణం

ఐదుగురిని ఢీకొన్న టెంపో

మద్యం మత్తులో వాహనాన్ని నడిపిన డ్రైవర్

3లో



ప్రమాదానికి కారణమైన వాహనం



కోటి ఆశలతో...

'ఉక్కు' సంకల్పంతోనే కొత్త ఆశలు

నిర్వాసితులకు పరిహారంపై నాన్చివేత

ఊసేలేని పరిశ్రమల స్థాపన

కరువు సాయంపై ఎదురుచూపు

ఉపాధిపై ఆశల్లో యువత

కొత్తఆశలు..సరికొత్త ఆలోచనలు..వాటి సాకారానికి పకడ్బందీ ప్రణాళికలు.. కొత్తఊసులతో కొత్తఏడాదికి ప్రజానీకం స్వాగతం పలికింది. గతేడాది జిల్లాలో కరువు కరాళనృత్యం చేయడంతో రైతు వదనంలో దుఖం కనిపించింది. ఊరించిన మేఘాలను నమ్మిన రైతాంగం కష్టనష్టాల పాలైంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కరువు సాయంలో విఫలం కావడం విస్మయాన్ని కలిగించింది. జిల్లా పారిశ్రామిక, సాగునీటి ప్రాజెక్టుల పురోగతి ఎక్కడ వేసిన గొంగళి చందంగా మారింది. 2019 సార్వత్రిక ఎన్నికల కోయిల కూనీరాగాల సందడి ఇప్పటికే మొదలైంది. దీంతో ఎన్నికల సందర్భంగానైనా ప్రభుత్వాలు సంక్షేమం వైపు మొగ్గు చూపుతాయని ప్రజానీకం భావిస్తోంది. రాష్ట్రప్రభుత్వం నూతన సంవత్సరం రెండవ రోజు నుంచే జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. గతేడాది సమస్యలే పరిష్కారానికి నోచక ఎదు రుచూస్తుండడంతో కొత్తగా పరిష్కారమవుతాయనే నమ్మకం సన్నగిల్లుతోంది. జిల్లాకు కృష్ణాజలాలు వచ్చాయని సంతోషించేలోపు రెవెన్యూ అసమర్థత కారణంగా ఆందోళన రెట్టింపైంది. కొత్తఏడాదిలోనూ నిర్వాసితులు కడగండ్ల మధ్య నలగాల్సిన దుస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో మూడో తేదీన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నిర్వాసితులకు పరిహారం విడుదల ప్రకటన ఉంటుందనే కోటిఆశలతో కొత్తఏడాదిలోకి అడుగుపెట్టింది.

4లో

3న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఖరారు

4లో

కథలతో జ్ఞానం మెండు : రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - నందలూరు

కథలు వల్ల జ్ఞానం పెరుగుతుందని రాష్ట్ర కథానిలయం వ్యవస్థాపకులు అబ్బిగారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నందలూరు కథానిలయం అరుణపప్పు రాసిన చందనపు బొమ్మ పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కథా రచయిత పాలగిరి విశ్వ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కథలు చదవడం వల్ల రోజు మనం చూసే బడుగు, బలహీన, అనాదులు, రైతులపై మనం చూసే దృష్టి మారుతుందని అన్నారు. మనలో మానవియ విలువలు పెరుగుతాయని, మనషులను అర్థం చేసుకొనే సంస్కారాన్ని నేర్పుతాయని తెలియజేశారు. పాలగిరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ అరుణపప్పు కథలన్ని సమకాలిన సమాజంలోని మనుషల మనస్థత్వాలను మన కళ్లముందు ఉంచుతాయని అన్నారు. మనలో ఉన్నత సంస్కారాన్ని పెంచే కథలు రాసిన అరుణపప్పును అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ అబ్దుల్లా, లయన్ నాగేశ్వరరావు, కథానిలయం కార్యదర్శి అల్లం అశోక్‌కుమార్, రాజంపేట న్యాయవాది సంఘం అధ్యక్షులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, ప్రభుత్వ సహాయ న్యాయవాది లక్ష్మీనారాయణ, యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుభాష విభాగాధిపతి ఆచార్య రామసుబ్బారెడ్డి, కొండూరు జనార్ధన్‌రాజు, సుబ్రమణ్యంరెడ్డి, శంకర్‌నాయుడు, ఇతరులు పాల్గొన్నారు.



పుస్తక పరిచయ కార్యక్రమంలో ప్రముఖులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యాదవ ఎంప్లాయిస్ సొసైటీ నాయకులు

ఎంప్లాయిస్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బద్వేలు

పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో యాదవ ఎంప్లాయిస్ సొసైటీ 2018 క్యాలెండర్‌ను పైడి నాగసుబ్బయ్య యాదవ్ ఆధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ యాదవ్, నెల్లూరు జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ ఉద్యోగులందరూ సమైక్యమైతే సమస్యలు పరిష్కారం అవుతాయని వారు చెప్పారు. యాదవులందరినీ విద్యా, సామాజిక, రాజకీయ పరంగా చైతన్యం చేయాలన్నారు. జరగనున్న 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న యాదవ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున నగదు అందజేస్తామని వారు ప్రకటించారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యులు జి.సత్యశ్రీనివాసరావుయాదవ్, వాకా రామయ్య యాదవ్, అంకయ్య యాదవ్, రమేష్‌యాదవ్, సంటెయ్య యాదవ్, సుబ్బరాయుడు యాదవ్, నరసింహులు రమణయ్య, చెన్నయ్య, బాలుడు, పివి రత్నం, పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-బద్వేలు

రాష్ట్రంలోని దేవాలయాలలో పనిచేస్తున్న డోలు, సన్నాయి, శ్రుతి, తాళం కళాకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బద్వేలు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక త్యాగరాజు కాలనీలో జరిగిన వాయిద్య కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో వాయిద్య కళాకారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. దేవాలయాలలో ట్రస్ట్‌బోర్డులో నాయిబ్రాహ్మణులను సభ్యులుగా చేర్చుకోవాలన్నారు. వేదపాఠశాలను స్థాపించినట్లుగానే త్యాగరాజస్వామి పేరుతో సంగీత పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పెంచలయ్య, పుల్లయ్య, వెంకటేష్, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.



క్రికెట్, వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

క్రికెట్, వాలీబాల్ కిట్ వితరణ

ప్రజాశక్తి - పోరుమామిళ్ళ

పట్టణంలోని మహబూబ్‌నగర్ కాలనీ యువకులకు నూతన సంవత్సరం పురస్కరించుకొని రూ.15 వేలు విలువ చేసే క్రికెట్, వాలీబాల్ కిట్‌ను ఎంపిపి చిత్తా విజయప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా అందజేశామని మాబూపీర తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి చిత్తా విజయప్రతాప్‌రెడ్డి యువతను ఉద్దేశించి మాట్లాడుతూ వక్రమార్గంలో పయనించి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఖాళీ సమయంలో ఆటలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా పౌండేషన్ ఛైర్మన్ రవిప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ తనయుడు మాలకొండయ్య, చిత్తా గిరిప్రణీత్ రెడ్డి, ఆకుల హరి, సుధాకర్, పీరయ్య పాల్గొన్నారు.

ఎపిఎండిసి కార్మికులకు వేతనం పెంపు



మాట్లాడుతున్న సిహెచ్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

మంగంపేట ఎపిఎండిసి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కొత్త సంవత్సర బహుమతిగా పది శాతం వేతన పెంపుపై సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఎపిఎండిసి వైస్ ఛైర్మన్, ఎండి సిహెచ్ వెంకయ్య చౌదరికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఎండిసి సంస్థలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్‌సోర్స్, ట్రైనీ, ఇతర కార్మికులకు 20 శాతం కొత్త ఏడాది సందర్భంగా బహుమతి పెంచి ఇవ్వాలని డిసెంబరు 20న ఎంపాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఎపిఎండిసి ఎండి వెంకయ్య చౌదరిని కోరగా ఆయన స్పందించి పది శాతం పెంచి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. రెగ్యులర్ ఎంపాయీస్‌కు రూ.6,490, 218 మందికి ఔట్ సోర్స్, ట్రైనీ వర్కర్స్‌లకు రూ.4,125 వంతున, 909 మందికి ఇతరులకు రూ.2,365 83 మందికి ఉపయోగకరమని ఆయన అన్నారు. 2018 కొత్త సంవత్సర బహుమతిగా 1210 మందికి మంగంపేట, విజయవాడ హెడ్ ఆఫీస్, వైజాగ్, సీమకుర్తి ప్రాంతాల కార్మికులకు వర్తిస్తుందని తెలిపారు. ఈ పది శాతం వంతునకు కృషి చేసిన ఎండి, ఇడి నాగరాజు, హెచ్‌ఆర్‌డి జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామసేవలో స్వచ్ఛంద సేవ ముందంజ

ప్రజాశక్తి - సిద్దవటం

సిద్దవటం పరిరక్షణ స్వచ్ఛంద వేదిక ద్వారా ఎగువపేటలోని తహశీల్దార్ కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయం ఎదురుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను స్వచ్ఛందంగా తొలగించారు. ఆదివారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట పేరుకుపోయిన చెత్తను దాదాపు నాలుగు ట్రాక్టర్లు ఎంఇఒ కార్యాలయం ఎదుట ఉన్న రెండు ట్రాక్టర్ల చెత్తను స్వచ్ఛంద వేదిక సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొని పరిశుభ్రం చేశారు. సిద్దవటం గ్రామంలో పారిశుధ్యం లోపించిన పరిస్థితులలో గ్రామాభివృద్ధి కోసం ఏర్పాటైన సిద్దవటం ఫ్యామిలీ గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ స్వచ్ఛంద కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వేదిక సభ్యులు మాట్లాడుతూ పారిశుధ్య విషయంలో సిద్దవటం గ్రామ పంచాయతీ, మండల వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం సైతం సరైన ప్రభావం చూపలేదన్నారు. సిద్దవటం ఫ్యామిలీ వాట్సప్ గ్రూప్ ద్వారా స్వచ్ఛంద వేదిక రూపొందించామని పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా సిద్దవటం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధి కోసం గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. స్వచ్ఛంద వేదిక కార్యక్రమం ద్వారా మన గ్రామం పలు గ్రామాలకు ఆదర్శంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు అహమ్మద్, షామీర్‌హుసేన్, వెంకటసుబ్బయ్య, ఖాదర్‌వల్లి, గ్రామస్తులు సుబ్బరామయ్య, నాగభూషణం, చిన్న, నజీర్, సుబ్బన్న, అమీర్, నూర్‌బాషలు ఉన్నారు.



స్వచ్ఛందంగా చెత్తను తొలగిస్తున్న సిద్దవటం ఫ్యామిలీ గ్రూప్, స్థానికులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బత్యాల

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్యాల చెంగ్రాయులు ఆయన నివాసంలో ఆదివారం ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రజల సమస్యలపై నిత్యం పోరాడడం అభినందనీయమని కొనియాడారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మామిళ్ళ సుబ్రమణ్యం, ఎంపిటిసి సభ్యులు నిమ్మకాయల మోహన్‌రెడ్డి, మాజీ సైనికులు కారుమంచి వెంకటసుబ్బయ్య, మామిళ్ళ సుబ్బయ్య, కస్తూరి సుధాకర్, శ్రీకారపు శివయ్య, పోతురాజు నవీన్‌లు పాల్గొన్నారు.

8 నుంచి వ్యక్తిత్వ వికాస తరగతులు

ప్రజాశక్తి-బద్వేలు

వెనుకబడిన విద్యార్థుల సౌకర్యార్థ కోసం మేకపాటి రాజమోహన్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనవరి 8వ తేదీన ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జనవరి 8 నుంచి వ్యక్తిత్వ వికాస తరగతులు జరుగుతాయని కాలేజీ ప్రిన్సిపల్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ సదస్సులో విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత ప్రవేశం, భోజన వసతి కూడా కల్పించబడుతుందని ఈ అవకాశాన్ని బద్వేలు నియోజకవర్గ ప్రజలు, యువత, విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వక్తలు షఫీ, సత్యవాణి, సుధీర్‌కుమార్, ప్రాసమణి, క్రిష్ణయ్య పాల్గొని మార్గనిర్దేశం చేస్తారని తెలియజేశారు.



కరపత్రాలను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల

రాఘవరాజుపురంలో ఎమ్మెల్యే పల్లె నిద్ర

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం రచ్చబండ, పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలు కరపత్రాలను పంపిణీ చేసి పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో జగన్ అధికారంలోకి రావడం ఖాయమని ఈ నవరత్నాల పథకాలను అమలు చేస్తారని ఆయన అన్నారు. గ్రామంలో రచ్చ బండ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పంజం సుకుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు సిహెచ్ రమేష్, మందల నాగేంద్ర, శివారెడ్డి, యనమాల మహేష్, ఆర్‌వి రమణ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - పోరుమామిళ్ళ

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిఎడ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ రామాంజులు, కరస్పాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం డైట్ విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రషర్స్ ఢే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు, ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. . అనంతరం ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత వెంకటేశ్వర్లను కళాశాల యాజమాన్యం శాలువాతో సన్మానించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో ఉల్లాసంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్‌డేలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

కువైటులో భారతీయులకు బాసట

ప్రజాశక్తి-కడప కోటిరెడ్డిసర్కిల్



కువైటులో ఉన్న ముస్లిం, దూదేకుల వారికి బాసటగా నిలుస్తామని ఎన్ఆర్ఐ, ఎన్ఆర్ఇ నూర్‌బాషా, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నూర్ సలీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. తమ సంఘం ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక సాయం కూడా చేశామని గుర్తు చేశారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యను కూడా అందించామన్నారు. భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలను చేపట్టడానికి ఎళ్లవేళలా ముందుంటామని పేర్కొన్నారు. కువైటులో ముస్లిం, మైనార్టీలు చనిపోతే ఈ సంఘం ద్వారా సొంత ఖర్చులతో మృతదేహాన్ని ఇండియాకు తరలిస్తామని తెలియజేశారు. కువైటులో భారతీయులు ఇబ్బందులు పడితే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.

అనాథశ్రయంలో అన్నదానం

ప్రజాశక్తి-కడప కోటిరెడ్డిసర్కిల్

నగరంలోని గండివీరాంజనేయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని సంస్థ వ్యవస్థాపకులు కిరసనాయిల్ వెంకటయ్య తెలిపారు. ఆదివారం ఎర్రముకపల్లి సర్కిల్ వద్ద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా రెండు ఆనాథశ్రమాల్లో తమ తలిదండ్రుల జ్ఞాపకార్థ కోసం అన్నదానం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. భవిష్యత్తులో మరెన్ని సేవా కార్యక్రమాలను చేపడుతామని తెలియజేశారు. ఎస్సీ,ఎస్టీ,ఓసీలకు చెందిన 246 పేద జంటలకు ఉచితంగా వివాహాలు జరపించామని వెల్లడించారు. దాదాపు 100 మందికి అన్నదానం చేశారు. అనాథులకు ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. యువతకు ఆనాథులకు చేయూతనందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అదే విధంగా విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తామని తెలియజేశారు.



అనాథులకు అన్నం తినిపిస్తున్న వెంకటయ్య

విద్యుత్‌శాఖఫోన్ నెంబర్లు

ఫ్యూజ్ ఆఫ్ కాల్ (నార్త్)	242355
ఫ్యూజ్ ఆఫ్ కాల్ (సౌత్)	241756
ఫ్యూజ్‌ఆఫ్ కాల్ (వెస్ట్)	241418
ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఈస్ట్)	277455
ఏఇ (విద్యుత్ భవన్)	257344
ఏఇ ఆపరేషన్స్	244873

అత్యవసర సర్వీసులు

ఎమర్జెన్సీ (ఆల్‌సర్వీసెస్)	108
ఎలక్ట్రిసిటీ	1912
వాటర్ వర్క్స్	241898, 243104
ఎపిఎస్ఆర్‌టిసి ఎంక్వైరి	244160, 7382925080
ఏపిఎస్ఆర్‌టిసి రిజర్వేషన్	243402
రైల్వే ఎంక్వైరీ	242131, 131
ఆల్‌ఇండియా రేడియో	244196
హెడ్‌పోస్టాఫీసు	241600

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి - చిట్వేలి

మండల పరిధిలోని కుమ్మర వీధికి చెందిన నాయిని లక్ష్మీదేవి భర్త వేధింపులకు తాళలకే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల కథనం మేరకు ఓబులవారిపల్లె మండలం కటికంవారిపల్లెకు చెందిన లక్ష్మీదేవి, వెంకటేష్‌లకు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి నాలుగు నెలల బాలుడు ఉన్నాడు. అయితే భర్త జల్సాలకు అలవాటు కావడంతో పెండ్లి అయినప్పటి నుండి భార్యను తరచు వేధిస్తుండేవారు. అయితే కాన్పుకు పుట్టింటికి వెళ్లిన లక్ష్మీదేవి మూడు నెలలు అమ్మ ఇంటివద్దే ఉండి ఒక నెల క్రితం అత్తగారింటికి వచ్చింది. సంఘటన విషయం తెలుసుకొన్న వెంటనే ఎస్ఐ డాక్టర్ నాయక్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని రాజంపేట పోస్టుమార్టంకు తరలించినట్టు ఆయన తెలిపారు.



మృతి చెందిన లక్ష్మీదేవి

విద్యా సమస్యలపై సమరశీల పోరాటాలు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - పోరుమామిళ్ళ

విద్యా సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌సి హాస్టల్ ఆవరణంలో ఎస్ఎఫ్ఐ 48వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ 1970 డిసెంబరు 30న ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల పక్షాన నిలబడి ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను ఎదిరిస్తూ అనేక పోరాటాలు నిర్వహించి అనేక విజయాలు సాధించిందన్నారు. రాష్ట్రంలో నేటికి విద్యార్థులు అనేక సమస్యలతో అల్లాడుతున్నారన్నారు. కాని వాటి పరిష్కారానికి టిడిపి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యా రంగ సంస్థపై ప్రభుత్వం దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోస్టిక్ ఛార్జీలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పక తప్పదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్, సహాయ కార్యదర్శులు తరుణ్, వినయ్, సందీప్, మనోజ్‌లు పాల్గొన్నారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు వెంకటరమణ

ప్రజాశక్తి - రాజంపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని దాని స్థానంలో పాత పింఛన్ విధానానికి కృషి చేయాలని ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు శెట్యం వెంకటరమణ అన్నారు. ఆదివారం ఎన్‌జిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్‌ను భిక్షంగానే పరిగణిస్తున్నాయన్నారు. పెన్షన్ అనేది భిక్ష కాదు హక్కు అని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికి నేటికి ప్రభుత్వాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. రిటైర్డు తహశీల్దార్ రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడుదారులకు అనుగుణంగా ఉద్యోగ వర్గాలకు వ్యతిరేకంగా అమలు చేస్తున్న సిపిఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని జనవరి 9న తాలూకా స్థాయిలో చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు. సిపిఎస్ విధానంలో ఉండే లోపభూయిష్ట విధానాలను పలువురు ఉద్యోగులు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నాగేశ్వరగౌడ్, పిఆర్‌టియు నాయకులు సోమశేఖర్, ఉమామహేశ్వరరావు, ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ ఆదిశేషారెడ్డి, చెన్నయ్య, సిపిఎస్ రాష్ట్ర కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్, ఎలక్ట్రిసిటి ఎంపాయీస్ ఉద్యోగం సంఘం నాయకుడు వెంకట్రామిరెడ్డి, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు సుబ్బనరసింహులు, ఎన్‌జిఒ కోశాధికారి వరదయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌వి రమణ

కారు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - చెన్నూరు

మండలంలోని శేషయ్యగారిపల్లె వద్ద ఆదివారం అతివేగంగా వెళ్తున్న కారు రోడ్డున్న దాటుతున్న నారాయణ(75) అనే వృద్ధుడిని ఢీ కొనడంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. శేషయ్యగారిపల్లెకు చెందిన తాటిగొట్ల నారాయణ (75) తమలపాకు తోటల్లో కూలీ రోజులాగే ఉదయాన్నే ఆకుతోటల్లో పనికి వెళుతూ రోడ్డు దాటుతుండగా కడప నుండి మైదుకూరు వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలో ఆయన మృతి చెందాడు. కారు డ్రైవర్ పరారయ్యేందుకు ప్రయత్నించగా దువ్వూరు వద్ద పట్టుకున్నారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఫోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రుణాల కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - వేంపల్లి

వేంపల్లిలోని చింతలమడుగుపల్లె సహకార సొసైటిలో రూ. 64.50 లక్షల మేర బోగస్ పట్టాదారు పాస్‌పుస్తకాలతో అక్రమ రుణాలు పొందారంటూ డిసెంబర్ 16న కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటీవ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య వేంపల్లి పోలీసు స్టేషన్‌లో అధికారులు, మిగిలిన వారిని కలిపి 17 మందిపై కేసు నమోదైంది. ఈ మేరకు రూరల్ సిఐ రామకృష్ణుడు ఈ కేసులో ఉన్న 17 మందిలో 5 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో చింతలమడుగుపల్లె సహకార సొసైటి మాజీ సిఇఒ ప్రసాద్‌తో పాటు కె. సుదర్శన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎ. గంగిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారిని త్వరలో అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు. వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి: ప్రభుత్వ విప్

ప్రజాశక్తి - రాజంపేట: 2018 నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖశాంతులతో ఉండడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం అన్నారు. ఆయన పాలనలో ప్రజలంతా అభివృద్ధి పథం లో నడవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంజీవరావు, సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్‌రాజు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం





మృతి చెందిన రామిశెట్టి రవి, దాండ్ల సుబ్బరాయుడు

ప్రజాశక్తి - మైదుకూరు

కడప జిల్లా మైదుకూరు మండలం నంద్యాల రోడ్డులోని కాల్వ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు మైదుకూరు పట్టణానికి చెందిన అయిదుగురు నంద్యాలరోడ్డులోని కాల్వకట్ట వద్ద ఆదివారం రాత్రి 9గంటలకు కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అనుకోకుండా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన టెంపో వారిపైకి దూసుకు వచ్చింది. సంఘటనలో రామిశెట్టి రవి (40), రాముడు (51) దాండ్ల సుబ్బరాయుడు (27) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం మైదుకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టెంపో డ్రైవర్ అతిగా తాగి వాహనాన్ని నడపడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. మైదుకూరు డిఎస్‌పి సిఆర్ శ్రీనివాసులు, అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు, రూరల్ సిఐ హనుమంతునాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం మైదుకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాసేపట్లో ఇంటికి తిరిగి వెళ్లాల్సిన వారు విగత జీవులుగా మారడాన్ని వారి కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోయారు. వీరి మరణం వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది

కోటి ఆశలతో...

ప్రజాశక్తి-కడపప్రతినిధి

జిల్లా అభివృద్ధి మూడున్నరేళ్లుగా మూడడుగులు ముందుకు ఆరడుగులు వెనక్కి చందంగా మారింది. రాష్ట్రవిభజన చట్టంలో పేర్కొన్న హామీలు సైతం అమలుకు నోచులేదు. జిల్లా అవసరాలకు సరిపడా నిధులు తెప్పించడంలో ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారు. ఏడాదికి ముందే సార్వత్రిక ఎన్ని కల కోయిల కూస్తుండడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఖరీఫ్, రబీ రెండింట్లోనూ వర్షాభావం వెంటాడింది. రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కరువు మండలాల జాబితా విడుదల చేయడంలో నిర్లక్ష్యం ఆవహించింది. కరువు సాయం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. మూడ్రోజుల కింద కేంద్ర కరువు బృందం కడప, చింతకొమ్మదిన్నె, చాపాడు, రాజుపాలెం మండలాల్లో పర్యటించి విజయవాడకు వెళ్లిపోయింది. సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి చందంగా అక్కడే ఉంది. వైఎస్ హయాంలో నిర్మితమైన రిజర్వాయర్లకు నీటి విడుదలపై ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. సాగునీటి కాల్వల పనుల పురోగతి పడకేసింది. గండికోట, సర్వరాయసాగర్, పైడిపాలెం, పిబిసి ప్రాజెక్టుల పరిధిలోని 74 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. గండి కోట రిజర్వాయర్ ముంపు పరిధిలోని 22 గ్రామాలకు పరిహారం చెల్లింపులపై నాన్చుడు ధోరణి అవలంభిస్తోంది. గండికోట 19 టిఎంసిల నీటిని నిల్వ చేయలేని దుస్థితి దాపురించింది. 22 టిఎంసిలను నిల్వ చేస్తేనే కొండాపురం ముంపునకు గురవుతుందనే అంచనా తల్లకిందులైంది. దీంతో నిర్వాసితుల ఆందోళన రెట్టింపైంది. ప్రభుత్వం కొండాపురం మండల కేంద్రానికి రూ.150 కోట్ల పరిహారం చెల్లింపులకు విడుదల చేయాలి. మండల కేంద్రమే ముంపునకు గురవుతుండడంతో కృష్ణా జలాల పరిమాణాన్ని తగ్గించి, ఇతర రిజర్వాయర్లకు మళ్లించింది. మూడున్నరేళ్లుగా పక్కాగృహ నిర్మాణ పనులను చేపట్టలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మార్కెటింగ్ మంత్రి ఆదినారాయణరెడ్డి, సివిల్ సప్లయ్స్ సంస్థ ఛైర్మన్ లింగారెడ్డి, ఎమ్మెల్సీ బి.టెక్ రవి, రామసుబ్బారెడ్డి పదవులు అలంకరించినప్పటికీ జిల్లాకు ఒరిగిందేమీ లేదనే విమర్శ వినిపిస్తోంది.

ఉక్కు పరిశ్రమ ఉద్యమం తీవ్రస్థాయిలో సాగుతోంది. కేంద్ర, రాష్ట్రప్రభు త్వాలు జిల్లావాసుల సహనాన్ని పరీక్షిస్తున్నాయనే విమర్శ వినిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వరంగంలోనే ఇంటిగ్రేడెట్ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అస్పష్ట సంకేతాలను అందిస్తున్నప్పటికీ ఉద్యమశక్తులు నమ్మడం లేదు. ఈనేపథ్యంలో కొత్త ఏడాదిలో మరింత ఉధృతంగా ఉద్యమం సాగడానికి పకడ్బందీ ప్రణాళికల రచనలో వామ పక్ష, అభ్యుదయశక్తులు ప్రణాళికల రచనలో నిమగ్నమయ్యాయి. కడపలో జిల్లాలో ఉక్కు పరిశ్రమ అంశం ఎన్నికల ఎజెండా మారనుంది. ఉపాధి లేకపోవడంతో గల్ఫ్ ప్రాంతాలకు వలస ఊపందుకుంది. జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ ఎస్ఎస్ ప్రాజెక్టుల పనుల్లో పురోగతి కనిపించడం లేదు. జిఎన్ఎస్-ఎస్-2 పనుల కాంట్రాక్టులను రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. పునరుద్ధరణ పట్టడంలేదు. ప్రతిపక్షనేత జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో తప్పుగా మారినట్లు కనిపిస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జిల్లాను చిన్నచూపు చూస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. రాజధానికి కడప నుంచి రాజధానికి అనుసంధాన మార్గం భూసేకరణ సంకెళ్ల మధ్య నలుగుతోంది. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల పట్టణాల్లో భూగర్భడ్రెయినేజీ సమస్య దశాబ్దాలుగా అస్తవ్యస్తంగా మారుతోంది. కమలాపురంలో డ్రెయినేజీ వ్యవస్థ ఆధునీకరణ హామీలకే పరిమితమైంది. కొప్పర్తి పారిశ్రామికవాడ ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. నీరు-చెట్టు పథకం పనులకు చెల్లింపులు చేయకపోవడంతో పథకమే నిలిచి పోయింది. గతేడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు బిల్లులు చెల్లింపులు నిలిచి పోవడం తెలిసిందే. ఈనేప థ్యంలో కార్యకర్తల్లో నిరాశానిస్పృహలు అల్లుకున్న దశ నుంచి కొత్త సంవత్స రంలోకి ఆశావహదృక్పథంలో అడుగిడుతున్న దృశ్యం ఆవిష్కృతమవుతోంది.

సెల్ టవర్ వేశారు - కనెక్షన్ మరిచారు


నిరుపయోగంగా ఉన్న సెల్ టవన్

మూగబోయిన సెల్‌ఫోన్లు
ఆందోళనలో వినియోగదారులు

ప్రజాశక్తి - వీరబల్లి

మండల పరిధిలోని గడికోట గ్రామంలో ఐదు సంవత్సరాలుగా సెల్ టవర్లు పనిచేయడం లేదు. బిఎస్ఎన్ఎల్, రిలియన్స్ టవర్లను యడబల్లె కస్పాలో నియమించారు. వాటికి కనెక్షన్ ఇవ్వడం మరిచారు. గడికోట గ్రామ ప్రజలకు ఫోన్ సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కానీ సెల్ టవర్ వేశారని మన ఊరిలో ఫోన్ల సౌకర్యం కలుగుతుందని గ్రామాలలోని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలు కావస్తున్నా సెల్ టవర్లకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై జిల్లా, మండల అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఇంత వరకు గామానికి సెల్‌ఫోన్ సౌకర్యం కల్పించలేదు. ప్రభుత్వం మాత్రం మారుమూల గ్రామాలలో సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్నారు కానీ ఈ గ్రామానికి సెల్‌ఫోన్ సౌకర్యం కల్పించడంలో అలసత్వం వహిస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గత కలెక్టర్‌కు కూడా విన్నవించామన్నారు. ఇప్పటికే ఎన్నో ప్రభుత్వాలు మారినా తమకు ఫోన్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సెల్ పని చేయాలంటే కొండ ఎక్కితేనే సెల్ మోగుతుంది, లేదంటే మూగబోతుంది. ఇప్పటికైనా పై అధికారులు చొరవ తీసుకొని తమ గ్రామానికి సెల్ టవర్ ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

సెల్ టవర్లు పనిచేయడంలేదు

మా గ్రామంలో సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు. గల్ఫ్ దేశాలలో ఉన్న బంధువులకు ఫోన్ చేయాలంటే ఇబ్బందిగా మారింది. సెల్ టవర్లు నియమిస్తే మా గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటర్నెట్ ద్వారా సమాచారాలు తెలుసుకొనేందుకు ఉంటుంది.

- నాగూర్‌రెడ్డి, గ్రామ నాయకుడు, గడికోట.

కృష్ణాజలాలతో నెత్తుటి మరకలను చెరిపేద్దాం

మండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల

కృష్ణాజలాలతో నాటి నెత్తుటి మరకలను చెరిపేద్దామని మండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలం పాటు ఎదురు చూసిన ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నం నెరవేరబోతుందన్నారు. సిఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో పులివెందుల ప్రాంతానికి కృష్ణాజలాలు రప్పించడం చారిత్రక ఘట్టమన్నారు. కృష్ణాజలాలు రావంటూ వైసిపి నాయకులు చేస్తున్న విమర్శలకు తిప్పికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అసాధ్యమన్నది చంద్రబాబుతో సుసాధ్యం చేశారన్నారు. చిత్రావతిలో సుమారు ఆరు టిఎంసిల నీటిని నిల్వ చేసి రెండేళ్ల పాటు సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. జనవరి 3న జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పుచ్చా ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మనిషిగా జీవిద్దాం - మానవత్వాన్ని చాటుదాం


గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి - తొండూరు

మనిషిగా జీవించి మానవత్వాన్ని చాటాలని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలలో ఎస్ఐ శ్రీనివాసులు గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఇనగనూరు, అగడూరు, బద్రంపల్లె తదితర గ్రామాలలో ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి సృష్టిలోని అన్ని ప్రాణుల కంటే తెలివైన వ్యక్తి అన్నారు. ప్రతీకారంతో రగిలిపోయి నమ్ముకొన్న స్నేహితులు, బంధువులను విడిచి ఆసువులు బాస్తున్నారన్నారు. గ్రామాలలో శాంతీయుతమైన జీవనం సాగించాలని ఆయన అన్నారు. ఫ్యాక్షన్ జోలికి వెళితే కుటుంబాలు సర్వనాశనం అవుతున్నాయన్నారు. నమ్ముకొన్న భార్య, పిల్లలు స్థితి ఏం కావాలని ఆయన అన్నారు. మారుతున్న కాలంతో పాటు మన ఆలోచనలు మార్చుకోవాలన్నారు. ఏది ఏమైనా నూతన సంవత్సరంలో అడుగుపెట్టి సంక్రాంతి పండుగలను ఘనంగా జరుపుకోవాన్నారు.

2 నుండి జన్మభూమి - మా ఊరు

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

2018 జనవరి 2 నుండి 5వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సోమశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2న శిబ్యాల, 3న డి. అబ్బవరం, 4న పెమ్మడపల్లె, 5న చెన్నముక్క పల్లె, 6న గొర్లముదివీడు, 7న కాటిమాయకుంట, 8న వరిగపాపరెడ్డిగారిపల్లె, 9న యండపల్లె, 10న మాధవరం గ్రామాలలో జన్మభూమి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని తెలిపారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులపొడులు

రంగులపొడికి భలే గిరాకీ


ప్రజాశక్తి-పులివెందుల

పట్టణంలో రంగులపొడికి భలే గిరాకీ ఏర్పడింది. సోమవారం కొత్త సంవత్సరం మొదలుకానున్న నేపథ్యంలో రంగవల్లులకు ప్రాధాన్యత ఉంటుంది. పండుగల కంటే కొత్త సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ క్రమంలో దుకాణాలు, వాహనాలు, కార్యాలయాలు అందం సంతరించుకుంటాయి. అలాగే ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి మగువలు పోటీపడతారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, కొన్ని పాఠశాలలు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశాయి. దీంతో రంగులపొడికి డిమాండ్ ఉంటుంది. ధరలు చుక్కలనంటుతున్నా వాటిని కొనుగోలు చేయడంలో మహిళలు ఏ మాత్రం వెనుకంజవేయలేదు. దీంతో చిరువ్యాపారులకు రెండు రోజుల పాటు ఉపాధి కలగడంతో కాస్త ఊరట చెందుతున్నారు. పట్నం మొదలుకుని పల్లెటూళ్ల వరకు ముగ్గులపై ఆసక్తి చూడంతో రంగులపొడికి గిరాకీ ఏర్పడిందని చెప్పడంలో సందేహంలేదు.

3న సిఎం జిల్లా పర్యటన ఖరారు

ప్రజాశక్తి - కడప

ఈ నెల 3న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన అధికారికంగా ఖరారైనట్లు జిల్లా కేంద్రానికి సమాచారం అందినట్లు జిల్లా రెవెన్యూ అధికారి బాబయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఉదయం పది గంటలకు తన నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10.25 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 11.10 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. 11.15 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 11.40 గంటలకు లింగాల మండలం పార్నపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌లో దిగుతారు. 11.50కి అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 12.00 గంటలకు లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి గండికోట నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తారు. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంటల వరకు రెస్ట్‌లో ఉంటారు. 1.30 గంటలకు డెలివరి సిస్టన్ పాయింట్ వద్ద నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి పార్నపల్లిలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 1.40 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 1.55 గంటలకు పులివెందులలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు పులివెందుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ధ్యాన్‌చంద్ ప్లేగ్రౌండ్ చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అక్కడ ఏర్పాటు చేసిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో సిఎం పాల్గొంటారు. సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి ఆరు గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. 6.05 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 6.30 గంటలకు తన స్వగృహానికి వెళతారని డిఆర్ఒ తెలిపారు.



ఉక్కు పరిశ్రమ, ప్రాజెక్టుల పూర్తి కోసం పోరాటాలు

బిజెపి , టిడిపిలు ద్రోహం చేస్తున్నాయి
2018 ఉద్యమాల సంవత్సరం
సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

ప్రజాశక్తి - కడపఅర్బన్

జిల్లాలో భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం, ప్రాజెక్టుల పూర్తి కోసం సిపిఎం పోరాటాలను ఉధృతం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరంలో పట్టుదలతో జిల్లా ప్రజలు, విద్యార్థులు, యువకులు, కార్మికులు అభివృద్ధికి కృషి చేయడాన్ని సిపిఎం కృతజ్ఞతలు తెలియజేస్తుందని చెప్పారు. ఉక్కు పరిశ్రమ, ప్రాజెక్టుల పూర్తికోసం, జిల్లాకు వనరులు తీసుకురావడానికి చేసిన పోరాటాలకు జిల్లాలోని విద్యావంతులతో పాటు అందరూ సహకరించారని తెలిపారు. బిజెపి, టిడిపి అధికారంలోకి వచ్చి 43 నెలలు కావస్తుందన్నారు. ఈ కాలంలో బిజెపి ఆంధ్ర రాష్ట్రానికి, వెనుకబడిన రాయలసీమకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. దీనిని సమర్థించే పార్టీగా టిడిపి వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఎపి ప్రత్యేక హోదా ఇవ్వమని బిజెపి 2007లో పేర్కొందని చెప్పారు. బుందేల్ తరహాలో రాయసీమకు ప్యాకేజి ఇవ్వకుండా ద్రోహం చేశారని తెలిపారు. దీనిని ఎండగట్టే పద్ధతిలో పార్లమెంట్‌లో టిడిపి, వైసిపి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. పార్లమెంట్ వెలుపల కూడా ఏమాత్రం ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. వైసిపి పచ్చి అవకాశం వాద రాజకీయలు చేస్తుందని విమర్శించారు. వైసిపి ఎపి ప్రజల ప్రయోజనాలకంటే వ్యక్తిగత ప్రయోజనాలకే 43 నెలలుగా ప్రాధ్యానత ఇస్తుందని తెలిపారు. టిడిపి, బిజెపి ద్రోహంలో జూనియర్ భాగస్వాములుగా ఉందని చెప్పారు. వైసిపి, బిజెపి వ్యవహారం కారణంగా రాయలసీమకు రావాల్సిన నిధులు ఆగిపోతున్నాయని పేర్కొన్నారు. 2018లో సిపిఎం ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఉద్యమాలు చేస్తుందని చెప్పారు. భారీ ఉక్కు పరిశ్రమ వస్తే 30వేల మందికి ప్రత్యంక్షంగా ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. చిన్న రేకుల పరిశ్రమను ఎన్నటికీ అంగీకరించమని హెచ్చరించారు. పోలవరంతో పాటు రాయలసీమలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కోసం వైపిసి ప్రయత్నించకపోతే ఈ ప్రాంత ద్రోహిగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ, ప్రాజెక్టుల పూర్తి, ప్రత్యేక ప్యాకేజి కోసం పోరాటాలకు జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు, వ్యాపారులు సహకరించి భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. పోరాటాలన్నింటికీ అన్ని రకాల అండదండలు అందించాలని కోరారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. పోరాటాల సంవత్సరంగా, అభివృద్ధి సంవత్సరంగా ప్రజలు ఆనందాలతో ముందుకు పోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జనవికాస్ సేవలు అభినందనీయం : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడపఅర్బన్

జనవికాస్ సేవాసమితి సేవలు అభినందనీయమని డిఎస్‌పి మాసూంబాష అన్నారు. ఆవివారం సమితి అధ్యక్షులు తాహీర్ ముద్రించిన 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ క్యాలెండర్‌లో ట్రాఫిక్, ర్యాగింగ్ పై అవగాహన శిక్షణలు, దొంగతనాల నివారణకు చేపట్టిన యాప్‌పై అవగాహన, బాలికల పరిరక్షణ, ఉన్నతాధికారుల నెంబర్లను క్యాలెండర్‌లో ముద్రించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు వచ్చినప్పుడు అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఎస్.అకడమీ చైర్మన్ అలీబాష, మస్తాన్‌బాష, సమితి ప్రతినిధులు వాజిద్, సికిందర్, అలీ, సద్దాం హుసేన్, కవిమిత్ర గౌస్‌ఖాన్, రాజశేఖర్, షరీఫ్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి మాసుంబాష

పాతపెన్షన్‌ను పునరుద్ధరించే వరకు ఉద్యమం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడపఅర్బన్



మాట్లాడుతున్న లక్ష్మిరాజ

కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించే వరకు ఉద్యమం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగి జీవిత భద్రత కోసం, సంఘాలు పోరాడి సాధించుకున్న హక్కును కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షను అమలులోకి తెచ్చాయని చెప్పారు. సిపిఎస్ రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నాయని పేర్కొన్నారు. పాలకవర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహిరిస్తున్నాయని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు కావస్తుందని, అయితే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఘరంగా విఫలమైందని చెప్పారు. విద్యారంగంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ 31వ స్థానంలో ఉందన్నారు. విద్యారంగాలనికి బడ్జెట్‌లో తగినంత నిధుల కేటాయింపులు లేవన్నారు. వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి, అరియర్స్ చెల్లించడంలో, నూతన పిఆర్‌సిని ఏర్పాటు చేయడంలో, డిఎంలను చెల్లించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. రూ.398 వేతనాలతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2008 హామీ పత్రాల ఉపాధ్యాయులకు జీతాలను రివైజ్ చేయాలని కోరారు. ఈ నెల 9న తాలూకా కేంద్రాల్లో జరిగే ధర్నాను, పిఆర్‌సి ఏర్పాటు కోసం జనవరి 29న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, 3న సావిత్రిబాయి పూలే జయంతి సభలను నిర్వహించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, ఎస్.వి.సుబ్బరాజు, గౌరవాధ్యక్షులు పి.చంద్రశేఖర్, కోశాధికారి హరిప్రసాద్, సహాధ్యక్షులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శులు వై.రవికుమార్, చెంగల్‌రాజు, మహేష్, నాగార్జునరెడ్డి, శ్రీనివాసులు, గంగన్న, రమణ, దేవదత్తం, మస్తానయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.



తోటకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

తోట కృష్ణకు సన్మానం

ప్రజాశక్తి - కడపఅర్బన్

ఎన్ఆర్ఐ ట్రస్ట్, ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ తోట కృష్ణను జుడిషియల్ కె.ఎం.ఎస్.నాయుడు, కె.ఎల్.రాజు, అబ్దుల్ సత్తార్, ఎ.ఎల్.నరసింహులు ఘనంగా సత్కరించారు. ఆదివారం నగరంలోని ఆయన స్వగృహంలో పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలకు ఎంతో అభివృద్ధి చేస్తూ పేద విద్యార్థులకు చేయూతనివ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో మరిన్ని కార్యక్రమాలను చేస్తూ అందరి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. తోట కృష్ణను స్ఫూర్తిగా తీసుకోని అందరూ ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రామచంద్ర, ధనుంజయ, గిరి పాల్గొన్నారు.

జాబితాను అనుమతికి పంపించాం

ప్రజాశక్తి - కడప

2017-18 సంవత్సరానికి కాపు కార్పొరేషనప్ కింద రుణాలు మంజూరు చేసేందుకు 2,116 అర్హులైన లబ్దిదారును గుర్తించి జాబితాను అనుమతి కోసం రాష్ట్ర కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయానికి పంపామని బిసి కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమోదం లభించిన తరువాత సబ్సిడీ నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాకి జమ చేస్తారని పేరొ్కన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి లబ్దిదారుని మొబైల్‌ఫోన్‌కు మెసేజ్ కూడా అందు తుందని తెలిపారు. లబ్దిదారునికి సమాచారం అందిన తరువాత సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - కడప

విజయదుర్గా కాలనీలో ఆదివారం సాయంత్రం 2017 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2018 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఘన గా వేడుకలు నిర్వహించారు. కాలనీ షటిలఖ్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు రాజారెడ్డి, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, షటిల్ అసోసియేష్ నగర అధ్యక్షులు గోవింద నాగరాజు ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. అందరికి కేక్‌ను పంచిపెట్టి ఒకరినొకరు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా 2018 నూతన సంవత్సరంలో అందరికి శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి, సభ్యులు రాధాకృష్ణ రామచంద్రారెడ్డి, ఆంజనేయులు, విజయదుర్గాకాలనీ వాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ

ప్రజాశక్తి - కడపఅర్బన్

పటెల్ రోడ్‌లోని మిత్రయోగ సెంటర్‌లో ఒకటవ తేదీ నుంచి యోగా శిక్షణ కొత్తబ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ రంగనాధరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో మానసిక వత్తిడిని తగ్గించి డయాబెటిస్, ఒబేసిటి, అధిక బిపి, థైరాయిడ్, ఆస్థమా వంటి దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు అవసరమయ్యే యోగాసనాలు, సూర్యనమస్కారాలు, షట్‌క్రియలు, ప్రాణయామం, ధ్యానం వంటి యోగ ప్రక్రియల్ని శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఈ శిక్షణలో ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి ఏడు వరకు మొదటి బ్యాచ్, తొమ్మిది నుంచి 10.30 వరకు రెండ బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక యోగా శిక్షణ ఉంటుందని తెలిపారు.

కెవ్వు 'కేక్'



ప్రజాశక్తి-కడప కోటిరెడ్డి సర్కిల్

కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా నగరంలోని బేకరీ షాపుల్లో రెండు రోజుల ముందే కేక్‌లు కెవ్వు మనిపించాయి. రంగు, రంగులతో అలంకరించి చూడగానే నోరించేలా కేక్‌లను తయారు చేశారు. వాటిని కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు. రూ.250 నుంచి రూ.1500 వరకు ధర నిర్ణయించి విక్రయించారు. కొన్ని దుకాణాల ముందు ప్రత్యేకంగా షామియాన వేసి కేక్‌లను విక్రయించారు. దీంతో బేకరీలన్నీ జనాలతో సందడి చేశాయి.

ఆకాశంలో ధరలు...

ఇదీలా ఉంటే పండ్లు, పూలు, బొకేలకు ధరలు ఆకాశనంటాయి. నూతన సంవత్సర వేడుకలు కావడంతో వీటికి డిమాండ్ ఏర్పడింది. కొత్త సంవత్సరం రోజున కిందిస్థాయి సిబ్బంది అధికారులకు, ఆయా పార్టీ కార్యకర్తలు నాయకులకు శుభాకాంక్షలను పండ్లు, పూలు, బొకెలతో తెలియజేస్తారు. డిమాండ్‌ను దుకాణదారులు ధరలు అమాంతం పెంచేశారు. పండ్లు కిలో వంద పైమాటే. పూలు మూర రూ. 40 పలుకుతోంది. ఏది ఏమైనా పండ్లు, పూలు, కేక్, బొకేల ధరలు కొండెక్కి కూర్చున్నాయి.



ఆఫర్లే ఆఫర్లు..

నగరంలోని మ మూర, పద్మావతి, ఇంకా పలు బేకరీలు నూతన సంవత్సరం సందర్భంగా ఆఫర్లు ప్రకటించాయి. కిలో స్వీట్స్ కొంటే అరకిలో మిక్చర్, అరకిలో స్వీట్స్ కొంటే, పావుకిలో మిక్చర్ ఉచితమని ప్రకటనలు గుప్పిస్తున్నాయి. ఆఫర్లను చూసి ప్రజలు కొనుగోలు చేయడానికి ఉత్సాహ పడుతున్నారు.









జ్ఞాపకాల వారధి...డైరీ

అక్షరాలుగా అనుభవాలు.. అనుభూతులు.. సాంకేతిక యుగంలోకి తగ్గని ప్రాధాన్యం

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

డైరీ అది ఒక జ్ఞాపకాల పేటిక. అనుభవాల పుట్ట. రాసుకొన్న డైరీని తీరిక వేళల్లో ఒక్కొక్క పేజీ తిరిగి చూసుకుంటూ ఎన్నో ప్రవహించే నది జలాలను తాకుతూ ఉన్నట్లుంటుంది. భావోద్వేగం, విషాదం, విరోదం కలకలిపి ఉంటాయి. ఆనందంతో, ఆవేదనతో రాసుకొన్న కవితలు, గేయాలు నిక్షిప్తంగా ఉంటాయి. డైరీ రాసే అలవాటు ఉన్న వారికి అందులోను ప్రతి పేజీ వారి ప్రతిభింభంగా నిలుస్తుంది. డైరీ మంచి నేస్తం.

కొత్త పేజీల ఎదురు చూపు

గుండె పొరల్లో ఎదిగి జ్ఞాపకాలను, కంటి వెనుక దాగివున్న కళలను అందంగా తమలో దాచుకుంటుంది. ఎన్ని మారినా డైరీ మారదలేదు, ప్రాధాన్యం తగ్గలేదు. 2017 ముగిసి 2018కి సరికొత్త రూపంలో డైరీలు స్వాగతం పలుకుతున్నాయి. పాత డైరీలు మూటకట్టుకొంటే, రేపటి కోసం కొత్త పేజీలు ఎదురు చూస్తున్నాయి.

పర్సనల్ డైరీలు

పర్సనల్ డైరీ అంటే ఒక వ్యక్తికి పూర్తి హక్కు తనకే ఉంటాయి. రాత్రి వేళల్లో తమ జ్ఞాపకాలను డైరీలో నిక్షిప్తం చేసుకొంటారు. వాటిని కొంత కాలం తర్వాత చదివి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవచ్చు.

ప్రొపెషనల్ డైరీలు

బాధ్యతలు అధికంగా ఉండే వారు క్రమం తప్పకుండా ఉపయోగించేది ప్రొపెషనల్ డైరీ. వృత్తిలో మరిచిపోకుండా చేయాల్సిన పనిని చెబుతుంది. ఆ డైరీ రోజు వారి షెడ్యూల్ కాకుండా కుటుంబ సభ్యుల, పెళ్లి, పుట్టిన రోజులు వంటి సమాచారాలు రాసుకోవచ్చు.

మనసు చిత్రానికి అద్దం పడుతుంది

డైరీ మనసులోనే చిత్రానికి అద్దం పడుతుంది. జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకొనేందుకు కాదు. గతంలో జరిగిన పొరపాటులు మళ్లీ జరగకుండా ఉపయోగపడుతుంది.

-చక్రేనాయక్, ఎంఇఒ లక్కిరెడ్డిపల్లె.

ఆర్థిక క్రమ శిక్షణ అలవబడుతుంది

దినచర్యగా డైరీ రాయడం అలవాటు చేసుకొంటే ఆర్థిక క్రమ శిక్షణ అలవడుతుంది. చక్కటి ప్రణాళికలు సిద్ధం చేసుకొనేందుకు ఉపయోగపడేలా డైరీ ఉపకరిస్తుంది.

-పుల్లయ్య, సిఐ లక్కిరెడ్డిపల్లె.



ప్రజాశక్తి
www.prajasakti.com
కడప
సోమవారం 1
జనవరి 2018

కొత్త ఆశలు

- పక్కా ప్రణాళికతో విజయం
- ఓడినా చింతవద్దు
- ఓటమికి పరిస్థితులే ప్రధాన కారణం
- బలహీనతల్ని గుర్తిస్తే సగం విజయం మీదే







ప్రజాశక్తి-కడప కోటిరెడ్డి సర్కిల్

కొత్త సంవత్సరం వచ్చింది. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ఆచరణకు పదును పెట్టాలని చాలా మంది ప్రణాళికలు రచిస్తుంటారు. ఈ ప్రణాళికల్లో ఏడాది కాలం గడిచిపోయింది. ఏదో సాధించాలని రాసిపెట్టుకున్న నిర్ణయాలన్నీ అమలుకాకుండానే కాలం చెల్లిపోయింది. గతించిన ఏడాదికి నిర్దేశించుకున్న లక్ష్య దూరం సగానికి చేరుకొనగానే ఏడాది గడిచిపోయింది. ఇప్పుడందరి మదిని బాధపెట్టే ఆలోచనలివి. ఏమీ సాధించలేమని? ప్రయత్నించినా లాభం లేదని నిర్ణయించుకుని కొందరు ఈ ఎత్తుగడ పారలేదు. కొత్త అవకాశం కోసం కొత్త ఎత్తుగడచేస్తూ సరికొత్త ప్రణాళిక రచిస్తున్నారు. డిసెంబర్ 31రాత్రి కల్లా ఫైనల్ చేసి ఫస్ట్ మార్నింగ్ నుంచి అమలు చేయాలని ఆరాటపడుతున్నారు. ఆరాటం ఉండాలి కానీ అందులో ఆవేశం ఉండకూడదు. ఓటమిలో మీ ప్రయత్నలోపమే కాదు పరిస్థితుల ప్రభావం కూడా ఉండొచ్చు. వందకు వంద మార్కులు వచ్చినా ఒక్కోసారి కోరుకున్న కళాశాలలో సీటు రాని పరిస్థితి, అందు కోసం వందమార్కుల ప్రశ్నాపత్రానికి జవాబులు రాసే మాటొక్క మార్పు తెచ్చుకొలేనట్లే. అనుకూల పరిస్థితుల్లో తీవ్ర ప్రయత్నంతో సాధించాలనుకోవడం వ్యర్థం. గత ఓటమికి కారణాలు వెతకడం ఉత్తమం. ఈ కారణాలు వెతికేటప్పుడు ఎవరినీ వ్యక్తిగతంగా నిందించకుండా, మీ లోని బలహీనతల్ని గుర్తించేందుకు ఆలోచించండి. మీ బలహీనతల్ని సరి చేసుకుంటే మీ బలం రెట్టింపవుతుంది.

రాసిపెట్టుకోండి..

విజయానికి కావాల్సింది బలమే. దానిని కూడగట్టుకునేందుకు ముందుగా మీకున్న బలమేమిటో రాసిపెట్టుకోండి. దాని పక్కనే మీ బలహీనతలేమిటో రాసిపెట్టుకోండి. బలానికి తగిన లక్ష్యాన్ని అందుకు అనుగుణంగా కార్యచరణను రాసుకోండి. బలహీనతను అధిగమించే ఆచరణను రాసుకోండి. వాటిని ప్రతి రోజూ, ప్రతి సందర్భంలో గుర్తు చేసుకోండి. అంటే ఆ చిట్టాలకు వల్లేవేయమని కాదు. మన లక్ష్యాన్ని, దాని కోసం ఎంచుకున్న గమ్యాన్ని గుర్తు చేసుకుంటుంటే రోజూ మనం చేయాల్సినవి చేస్తున్నామా? లేదో? ఎప్పటికప్పుడు మననం చేసుకోవడం అలవాటు అవుతుంది. ఇలాంటి అలవాటు కోసం లక్ష్యాన్ని గుర్తు చేసుకోవడం కోసమే ఓ వాచిని కొనిపెట్టుకోండి. అది కనిపించిన ప్రతిసారీ మీకు మీ లక్ష్యం గుర్తుకొస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లో ఓ ఇమేజ్‌ను ద ఎంచుకుని, దానిని స్క్రీన్ ఇమేజ్‌గా సెలెక్ట్ చేసుకోండి. ఫోన్ చూసిన ప్రతి సారీ మీ కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంది. ఇంట్లో వస్తువులు, ఫొటో ఫ్రేములు మొదలైనవి కొత్త ఏడాది లక్ష్యానికి గుర్తుగా ఒకదానిని ఎంచుకోండి. నాలుగు రోజుల తరువాత మీ లక్ష్యాన్ని మరిచిపోయినా అది కనబడుతూ అప్పుడప్పుడూ గుర్తుకు తెస్తుంది.

కొత్తదారులెయ్యాలే..

సాధనతో సాధించలేనిది ఏదీ లేదు. సడలని పట్టుదల ఉంటే చాలు. కాకపోతే వ్యక్తిగత సామర్థ్యం, మీకున్న వనరులే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరగలరో, లేదో నిర్దేశిస్తుంది. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పుడు అందుకు వెచ్చించాల్సిన సమయం, మీకున్న అనుకూలత గురించి మొదటిగా ఆలోచించాలి. అంత సమయం కేటాయించగల్గినట్లయితే దానికి అవసరమైన వనరులు మీకు ఉన్నాయో? లేదో పరిశీలించుకోవాలి. ఆర్థిక వనరులు, వసతులు, కుటుంబ సహకారం లేకుండా విజయం సాధించడం కష్టం. సాధ్యం కాని లక్ష్యంతో కాలాన్ని వృథా చేసుకోకుండా మీకు తగిన లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. మనిషికి అనేక అభిరుచులు, అనేక లక్ష్యాలు ఉంటాయి. మొదటి సాధ్యం కాకపోతే రెండోదానికి ప్రయత్నించాలి.

వాయిదాలను వాయిదా వేద్దాం..!

సాధారణంగా రేపు మొదలు పెడుదాం అన్నారో ఇక మీ లక్ష్యం మొదలు కానట్లే. ఈ రోజు వదిలేద్దాం. రేపటి నుంచి సంగతి చూసేద్దాం అని చాలా మంది అనుకుంటారు. ఈ రోజుకు ఎన్ని గంటలో రేపటికీ అన్ని గంటలే. కాబట్టి నేటిలాగే రేపూ వాయిదా వేస్తారు. వాయిదా ఆలోచన వచ్చిప్పుడే ఈ రోజు చేయలేని పనిని రేపు ఎలా చేస్తాం.? అని మిమల్ని మీరే ప్రశ్నించుకోండి. ఈ రోజు వాయిదా వేయడానికి కారణం ఏమిటో ఆలోచించుకోండి. ఈ వాయిదాలే లక్ష్యానికి బారికేట్‌గా నిలుస్తుంది. దీన్ని అధిగమిస్తే దేనినైనా అధిగమిస్తారు.

విజయానికి మెట్లు..

లక్ష్యం పరిమిత కాలంలో చేరుకోవాలని నిర్దేశించుకోవాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకోగానే దానికి అనుగుణమైన కార్యచరణ ఉండాలనుకుంటే కష్టాలు పడుతారు. లక్ష్యానికి తగిన ప్రణాళిక ఉండాలి. మన విజయానికి ప్రణాళికే దారి చూపిస్తుంది. ఆ దారి సాఫీగా ఉండాలంటే నిర్దిష్ట కాలపరిమితితో అనేక ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఉదాహరణకు రోజూ ఐదు గంటలపాటు చదవాలని నిర్ణయంతీసుకున్నారనుకోండి. మొదటి రోజే ఐదు గంటలు చదివేందుకు ప్రయత్నిస్తే చదవలేరు. తలనొప్పి, చిరాకు కలుగుతాయి. రెండో రోజు చదువలేక వాయిదా వేస్తారు. ఇలా అనేక వాయిదాలతో చదవు సాఫీగా సాగలేదు. మొదటి వారం పాటు రోజూ ఒక గంట చదవాలని నిర్ణయించుకోండి. మొదటి దానిని తప్పక పాటించండి. రెండో వారం రెండు గంటలపాటు చదవడం మొదలు పెట్టండి. ఇలా చేస్తే నెలరోజుల్లో మీరు అనుకున్న సమయం చదవగలరు. వ్యాయామం, ఆహారం, ఆరోగ్యం, కుటుంబం, వ్యాపారం, కళలకు సంబంధించిన ఏ విషయంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా దానికి తగిన ఉప ప్రణాళికలను కూడా రచించుకోవాలి.

నలుగురితో పంచుకోండి..

ఏడాది కాలంలో ఫలానా సాధించాలని నిర్ణయించుకున్నానని చాలా మంది ఇతరులకు చెప్పరు. కొందరు ఇంట్లో కూడా చెప్పరు. కారణం తెలిస్తే నవ్వుతారని, విఫలమైతే కామెంట్ చేస్తారని భయం. ఇలాంటి విమర్శకులు మీరు దారి తప్పకుండా సహాయ పడుతారు. కాబట్టి తప్పక చెప్పండి. అందరూ విమర్శించరు. అర్థం చేసుకున్న కొందరు మీరు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు సహాయపడవచ్చు. మీరు దారికి తప్పినప్పుడు వాళ్లు మీ లక్ష్యాన్ని గుర్తు చేశారు. తమకు తెలిసిన విషయాలను మీతో పంచుకుంటారు. ఆ ప్రయత్నంలో విజయం సాధించేందుదకు సూచనలు చేస్తారు.

గెలుపునకు బాసట..

సమిష్టి నిర్ణయం గెలుపునకు బాట. నలుగురు బాసటగా నిలిస్తేనే మీరు విజయబాటలో పయనించగలుగుతారు. నిర్ణయం తీసుకునేటప్పుడు మీ కుటుంబ సభ్యులు, మీతో కలిసి ఉండే వారితో మీ ఆలోచనలను ముందుగా పంచుకోండి. వాళ్ల అభిప్రాయాలను తీసుకోండి. మీ ప్రయత్నం సఫలం కావడానికి రేపు వారంతా సాయపడుతారు. మీకు మీరుఆ అన్ని నిర్ణయాలు తీసుకుని రేపు సాయం కోరితే వాళ్లకు ఇది సాధ్యం కాకపోవచ్చు, కావచ్చు. ముందుగా చర్చిస్తే మనకు సహకరించాల్సిన వారు ఏ మేరకు సాయపడుతారో తెలుస్తుంది. ఒకరి నిర్ణయం అందరిపై రుద్దితే వాళ్లే కాదు మీరు కూడా ఇబ్బంది పడుతారు. మీతో కలిసి ఉండేవాళ్లతో కలిసే నిర్ణయం తీసుకోండి.



బండబారుతున్న రోళ్ల బతుకులు



ఆధునిక యంత్రాల రాకతో తగ్గిన వ్యాపారం

ప్రజాశక్తి-పులివెందుల

రోళ్లను అమ్ముకుని జీవించే బతుకులు బండబారుతున్నాయి, వీటికి ఆదరణలేకపోవడంతో వారి బతుకుదెరువు మరింత కష్టమవుతుంది, ఒక సామాజిక వర్గానికి చెందిన కొన్ని కుటుంబాలు ఇప్పటికీ రోళ్ళు, విసుర్రాళ్లను జీవనోపాధిగా ఎంచుకుని బతుకుబండిని లాగిస్తున్నారు, వారి తాత ముత్తాతల కాలం నుంచి అదే వృత్తిని కొనసాగిస్తూ వస్తున్నారు. నిలువ నీడ ఉండదు రోళ్లను విక్రయించుకుంటే తప్ప పొట్టగడవని పరిస్థితి. ఇంతటి కష్టజీవులు మరెక్కడా ఉండరన్పిస్తుంది. జీవితంలో కష్టాలకు ఓర్చినా వారి పిల్లలకు మంచి భవిష్యత్‌ను అందిస్తున్నారా అంటే అదీలేదు. చివరకు వారి బిడ్డలు కూడా అదే వృత్తికి అంకితమవుతున్నారు. మోయలేని భారాన్ని నెత్తినవేసుకుని మరోవైపు చంకలో బిడ్డనేసుకుని ఊరూరా తిరుగుతూ రోళ్లను అమ్ముకుని రెండురాళ్లను వెనకేసుకోవడం వారి జీవన కృత్యం. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు ఎవరంటే వీరే ముందుస్థానంలో ఉంటారని చెప్పవచ్చు. వారి కష్టం చెప్పనలవికాదు, సుదూర ప్రాంతాల నుంచి రాళ్లను తెప్పించుకుని వాటిని రోళ్లగా మలచడంలో వారికి వారే సాటి, అసమర్థ ప్రభుత్వాల పాలన వల్ల పెరిగిన నిత్యావసరాల మాదిరిగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో వాటిని తెప్పించుకునే సమయంలో రవాణా చార్జీలు అదనంగా వస్తాయని రోళ్ల వ్యాపారులు చెబుతున్నారు. మరో వైపు సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో యాంత్రికపరమైన వస్తువులనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. వాటిపైనే ప్రజలు కూడా మక్కువ చూపుతున్నారు. రోళ్ల స్థానంలో మిక్సీ, గ్రైండర్ వంటి ఆధునిక యంత్రాలు రావడంతో రోళ్లకు ఆదరణ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. పల్లె మొదలుకుని పట్నం వరకు యాంత్రిక సంబంధమైన వస్తువలనే ఉపయోగిస్తున్నారు. పూర్తిగా యాంత్రిక జీవనం సాగిస్తున్న ప్రజలకు పాతతరంనాటి వస్తువులను పక్కనపెడుతున్నారు. వంటకు సంబంధించిన పాత్రల నుంచి వ్యవసాయం వరకు యాంత్రిక పరికరాలే ఉపయోగిస్తుండటంతో పాతరాతి యుగానికి కాలం చెల్లిందని చెప్పవచ్చు. కానీ కుల వృత్తిని వదలుకోలేకనే బతుకు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. బతుకుదెరువు కోసం ఎన్ని మార్గాలు అన్వేషించినా, కుల వృత్తిని కొనసాగించినా ఎలాంటి తప్పులేదు. కానీ వారి వంశాంకురమంతా అదే వృత్తికి అలవాటు పడటం బాధిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సమాజంలో వారిని కూడా చైతన్య వంతులను చేయాల్సిన అవరసం ఉంది. ఇలాంటి వారిని గుర్తించి చదువు ఆవశ్యకతపై అవగాహన కల్పించి బండబారిన రోళ్ల బతుకులకు దశాదిశా నిర్ధేంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది.

కృష్ణాజలాల విడుదల ఓ నాటకం

ప్రజాశక్తి-పులివెందుల

కృష్ణాజలాల విడుదల ఓ నాటకమని లింగాల ఎంపిపి సుబ్బారెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు రసూల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక పాత ఎంఎల్ఎ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పిబిసి చివరి ఆయకట్టు వరకు నీరందించినప్పుడే సిఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉన్నట్టు భావిస్తామన్నారు. వైఎస్ హయాంలో 80-90శాతం వరకు ప్రాజెక్టులు, లింగాల కుడి కాల్వ పనులు పూర్తియ్యాయన్నారు. మిగిలిన శాతం పూర్తి చేయడంతో చంద్రబాబు విఫలమయ్యారని ఆరోపించారు. పిబిసికి సంబంధించిన పిల్ల కాల్వలు సరిగాలేవన్నారు. చాలా చోట్ల కంపచెట్లతో కూరుకుపోయి ఉన్నాయన్నారు. లింగాల కుడికాల్వకు సంబంధించి 5శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి చంద్రబాబు చిత్తశుద్ధి ఏమిటో నిరూపించుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం కార్యదర్శి సర్వోత్తమరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, సింగారెడ్డి, బాషా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మను దర్శించుకొంటున్న జడ్జి రాజశేఖర్ దంపతులు

గంగమ్మ ఆలయాన్ని సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

మండలంలోని అనంతపురం గ్రామంలో ఉన్న గంగమ్మ ఆలయంలో జడ్జి రాజశేఖర్ దంపతులు అమ్మవారిని దర్శించుకొన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లా నలుమూలల నుండి భక్తులు తరలి వచ్చారు. మండల వెంకటేశ్వర కళామండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించి భక్తులను అలరింపజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇఒ సురేష్‌కుమార్‌రెడ్డి, చైర్మన్ క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో అసౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు తుమ్మల హరినాథ, మహదేవ, చెన్నూరు సుబ్బయ్య, ఆంజినేయులు, అర్చకులు పాల్గొన్నారు.

సుఖశాంతులతో మెలగాలి : ఎంపీ

ప్రజాశక్తి-పులివెందుల

ప్రజలు సుఖశాంతులతో మెలగాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆకాంక్షించారు. పట్టణ పరిధిలోని బాకరాపురంలో వైఎస్సార్‌టిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పొడవునా ప్రజలు సుఖసంతోషాల మధ్య గడపాలన్నారు. ప్రజలు ఎల్లవేళలా సుభిక్షంగా ఉండాలన్నదే వైసిపి ధ్యేయమన్నారు. ఏమైనప్పటికీ ప్రజల వెంట ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వెల్లడించారు. ప్రజల అభివృద్ధికోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారని తెలిపారు. వైఎస్ జగన్ అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనాథరెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల వైఎస్సార్‌టిఎఫ్ అద్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

2 నుండి జన్మభూమి-మా ఊరు

ప్రజాశక్తి - రామాపురం

జనవరి 2 నుండి ప్రారంభవుతున్న 5వ విడత జన్మభూమి మా ఊరు గ్రామ సభలను జయప్రదం చేయాలని తహశీల్దార్ దేవళానాయక్, ఎంపిడిఒ అబ్దుల్ రహీం అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం జన్మభూమి కార్యక్రమంపై సమావేశం నిర్వహంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మభూమి సమావేశాలు పండుగ వాతావరణంగా చేసుకోవాలన్నారు. గ్రామ సభలో అర్జీలు ఇచ్చే వారి ఆధార్, సెల్ నెంబర్ తీసుకోవాలన్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్ వారి స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవళిలు వేయించాలన్నారు. సాధికారిక సర్వేపై దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామ సభకు ముందు రోజు ఆయా గ్రామ స్థాయి అధికారులు పల్లెనిద్ర చేయాలన్నారు. సమావేశంలో డిటి నరేంద్రకుమార్, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులరెడ్డి, ఎంఇఒ రామకృష్ణుడు, పిఆర్‌జెఇ సుధాకర్, ఎపిఒ పెంచలయ్య, గ్రామ కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

జన్మభూమి సమావేశానికి ప్రత్యేక అధికారి డుమ్మా

జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తుండగా ప్రత్యేక అధికారి డుమ్మా కొట్టాడు. వెలుగు ఎపిఎం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వైద్య, పశు సంవర్థకశాఖలు, ట్రాన్స్‌కో హసనాపురం, నల్లగుట్టపల్లె, సుద్దమళ్ళ కార్యదర్శులు వాటర్‌షెడ్ గ్రామ స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు.

తొండూరులో...

జనవరి 2 నుంచి జన్మభూమి మా ఊరు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎ. మల్లేశ్వరి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల వారీగా 2న సైదాపురం, తేలూరు, 3న మడూరు, గుండ్లమడుగు, 4న ఇనగనూరు, 5న అగడూరు, 6న పాలూరు, బద్రంపల్లె, 7న మల్లేల, 8న సంతకొవ్వూరు, 9న గోటూరు, 10న బోడివారిపల్లె, బూచుపల్లె, 11న ఊగడవగండ్ల, తొండూరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ గ్రామ సభలలో పింఛన్లు, రేషన్‌కార్డుల సమస్యల పరిష్కారం, కొత్త కార్డుల మంజూరుకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు.



జన్మభూమి కార్యక్రమంపై మాట్లాడుతున్న తహశీల్దార్



మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

పింఛను భిక్ష కాదు ఉద్యోగి హక్కు

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

పింఛను భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌యాదవ్, జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోం కార్యాలయంలో పెన్షనర్ల సాధన సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడి పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ తాలూకా అధ్యక్షులు బలరామరాజు, శివశంకర్ రెడ్డి, రవీంద్ర, సూరుడునాయక్, నరసింహులు, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో ఉల్లాసంగా పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి - వేంపల్లి

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం భారత్ ఏజెన్సీ ఆధ్వర్యంలో విప్రో సంతూర్ కంపెనీ వారు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 153 మంది మహిళలు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు డైరెక్టర్ భగవన్నారాయణ, సంతూర్ కంపెనీ సెల్స్ ఆఫీసర్ మల్లిఖార్జునరెడ్డి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మౌనిక, దీప్తి, రెండవ బహుమతి జాహ్నవి, చందన, మూడవ బహుమతి మాలతి, మాధవిలు గెలుచుకొన్నారు. మొదటి బహుతి రూ. 5వేలు, రెండవ బహుమతి రూ. 2500, మూడవ బహుమతి రూ. 1250 విలువ చేసే బహుమతులు అందజేశారు. వీరితో పాటు 15 మందికి ఒక్కొక్క రూ. 1000 విలువ చేసే బహుమతులు ప్రోత్సాహకరంగా అందజేశారు. పోటీలలో పాల్గొన్న మహిళలకు ఒక్కొక్కరికి రూ. 100 విలువ బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సరంలో కొత్త నిర్ణయాలు తీసుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భారత్ ఏజెన్సీ నిర్వాహకులు బాలవెంకటరెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న అధికారులు

మహిళలపై ఆత్యాచారాలు ఆందోళనకరం

ప్రజాశక్తి - వేంపల్లి

2017 సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నారా వారి నేరాల సంవత్సరంగా పేర్కొనడం సబబుగా ఉంటుందని ఆదివారం పిసిసి ఉపాధ్యక్షులు తులసిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ బిజెపి విడుదల చేసిన 2017వ నేర విభాగ నివేదిక ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తోందని అన్నారు. నివేదిక ప్రకారం 2016తో పోలిస్తే 2017లో మొత్తం నేరాలు 27.43 శాతం పెరిగాయన్నారు. 2016లో మొత్తం నేరాలు 95 వేలు నమోదు కాగా, 2017లో లక్షా 17 వేలు నమోదు అయ్యాయన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు, మహిళలపై హత్యాచారాలు, అపహరణలు అధికమమైయ్యాయన్నారు. చంద్రబాబు పాలన అవినీతికి, అసమర్థతకు, అబద్దాలకు, అప్పులకు చిరునామాగా తయారైయిందన్నారు. 2018లోనైనా రాష్ట్రం నేరాల రుగ్మత నుండి బయట పడాలని కాంగ్రెస్‌పార్టీ ఆశిస్తోందన్నారు.

ఎబికెఎస్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడిగా శ్రీనివాసులుఎన్నిక

ప్రజాశక్తి - మైదుకూరు

అఖిల భారత కాపు బలిజ సమగ్ర మైదుకూరు నియోజకవర్గం కమిటీని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. నియోజకవర్గ యువ జన అధ్యక్షుడిగా యాపరాల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడుగా గోశెట్టి బుసొల్లా రవీంద్ర ను ఎంపిక చేశారు. అనంతరం కాపు బలిజ సమాఖ్య క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజలు ఐక్యత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా మన్నారు. కార్యక్రమంలో ఎబికెఎస్ కార్యవర్గ సభ్యుడు పాశం రామ్మోహన్, మైదుకూరు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మాచనూరు చంద్ర, బలిజ సోదరులు పాల్గొన్నారు.

పెళ్లికి ముందే డబ్బులివ్వాలి

కడపఅర్బన్ : దుల్హన్ పథకం కింద పెళ్లికి ముందే వధువుకు నగదు ఇవ్వాలని జిల్లా ప్రభుత్వ సర్కార్‌జీ సయ్యద్‌షా మహమ్మద్ జమాలుల్లా బాషా కోరారు. ఆదివారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుల్హన్ పథకం ప్రశంసనీయమని చెప్పారు. పెళ్లికి ముందే డబ్బు అందజేస్తే వధువు కుటుంబానికి ఎంతో ఉపయోగమని చెప్పారు. కార్యక్రమంలో ముస్లిములు పాల్గొన్నారు.



జెండా పండుగలో పాల్గొన్న ముస్లిములు

ఘనంగా జెండా పండుగ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మండల పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో జెండా పండుగను కులమతాలకు అతీతంగా నిర్వహించారు. మాబుసుబహాని దస్తగిరి స్వామి దర్గాలో 11 రోజుల ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చివరి రోజున పక్కీర్ల మేళాలతో జెండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. రెండేళ్లుగా జెండా పండుగను ఘనంగా జరుపుకుంటామని తెలిపారు. అనంతరం ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చాంద్‌బాష, మహ్మద్ సాదిక్, మహ్మద్ జాఫర్, తాజ్, మౌనుద్దీన్, మహ్మద్ రఫి, జాకీర్, సోపాబాషా కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలే పార్టీకి పునాది : సిపిఎం



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- జమ్మలమడుగు

ప్రజా పోరాటాలే సిపిఎంకు పునాది అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మనోహర్, సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై ప్రజలను ఏకం చేసి చైతన్యం చేయాలన్నారు. ప్రజల సమస్యలు ప్రభుత్వాలు గాలికి వదిలేశాయన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతోన్మాదాలను ప్రోత్సహిస్తూ దాడులకు తెగబడుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయాలనే కుట్ర పన్నుతోందన్నారు. ఇప్పటికే జిఎస్‌టి రావడంతో ప్రజలు ఆర్థికంగా కుదేలు కావడంతో పాటూ నిత్యావసర సరుకులు విపరీతంగా పెరిగిపోయా యన్నారు. తద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నల్లధనం పేరుతో ఆర్థిక సంక్షోభం సృష్టించారనీ, ఎక్కడా నల్లదనం బయట పడిన దాఖలాలు లేవని తెలిపారు. బిజెపి, మోడీ గ్రాఫ్ తగ్గిందనడానికి ఇటీవల జరిగిన గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ఎన్నికలే నిదర్శనమన్నారు. మోడీ విదేశీ పర్యటనలు తప్ప దేశానికి చేసింది శూన్యమన్నారు. ఇటు రాష్ట్రంలో కూడా చంద్రబాబు ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ వేస్తోందదన్నారు. చంద్రబాబుకు తెల్లవారితే అమరా వతి, రాజధాని తప్ప ప్రజా సమస్యలు కనిపించ లేదన్నారు. ఒక వైపు ఆర్థిక లోటు అంటూనే మరోవైపు అమరావతికి, రాజధానికి వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడని చెప్పారు. విభజన చట్టంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని తెలిపారు. ఈ క్రమంలో సిపిఎం ప్రజల తరుపున పోరాడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల వైపు మళ్లించాలంటే ప్రజా పోరాటాలు చేయక తప్పదని ప్రజలను ఆ దిశగా మళ్లిం చాలన్నారు. జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం, గండికోట, సోలార్ భూబాధితులకు నష్టపరిహారం చెల్లింపు విష యాల్లో ముందుండాలని తీర్మానించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సభ్యులు శివనారాయణ, లక్ష్మీనారాయణ, భాగ్యలక్ష్మీ, యోహాను, దాసు, డేవిడ్, కొండయ్య, క్రిష్ణ, శేషయ్య, శ్రీను, వినయ్ పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యల పరిష్కారమే ఎస్‌ఎఫ్‌ఐ లక్ష్యం

జిల్లా అధ్యక్షుడు సగిలి రాజేంద్రప్రసాద్



జెండాను ఆవిష్కరిస్తున్న రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - మైదుకూరు

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్‌ఎఫ్‌ఐ లక్ష్యం అని జిల్లా అధ్యక్షుడు సగిలి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ హాస్టల్ ఆవరణంలో ఎస్‌ఎఫ్‌ఐ 48వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1970డిసెంబర్ 30న ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భవించిందని, అప్పటి నుండి ఇప్పటి వరకు ఎస్‌ఎఫ్‌ఐ విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం నిర్వ హిస్తోందని అన్నారు. ఎపి రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలు పడుతున్నారని వీటి పరిష్కారానికి తెలుగుదేశం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు తెలిపారు. విద్యా రంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం రాబోవు రోజుల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దాసరెడ్డి, సాయి, పుల్లయ్య, నాయక్, సంజీవ్, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పగలే లోడింగ్.. అన్‌లోడింగ్

పగలే బారులు తీరుతోన్న లారీలు

ట్రాఫిక్‌కు అంతరాయం

ఇబ్బందుల్లో వాహనదారులు

పాదచారులకూ కష్టమే

పట్టని అధికారులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలో ఆయా దుకాణాల ముందు లారీలు వివిధ సరుకులను పగలే లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నారు. దీంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య అధిక మవుతోంది. అటు వాహనదారులు, ఇటు పాద చారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా రాత్రుళ్లు దుకాణదారులు లారీల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి సరుకులను తెప్పించి అన్‌లోడింగ్ చేస్తారు. ప్రస్తుతం లారీల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు ఇబ్బంది కల్గిస్తూ పగలే సరులను దించుతున్నారు. గంటల కొద్ది మెయిన్ రోడ్డు, ఇతర వీధుల్లో భారీ వాహనాలు నిలుస్తుండడంతో ట్రాఫిక్‌కు అంత రాయం ఏర్పడుతోంది. అసలే ఇరుకైనా రోడ్డులో డివైడర్లు ఉండడంతో ఎదురెదు రుగా వాహనాలు వెళ్లేందుకే కష్టంగా ఉంది. దీనికి తోడు గా సబ్‌జైలుకు ఎదురుగా ఉన్న ఫర్టిలైజర్స్ దుకాణాల వారు, ముద్దనూరు రోడ్డులోని దుకాణాదారులు పట్ట పగలే గంటల తరబడి లోడింగ్, అన్ లోడింగ్ చేయ డంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడు తున్నారు. అక్కడ లారీలు నిలబడడం తో దాటు కోవడానికి బస్సు డ్రైవర్లు ముప్పు తిప్పలు పడుతున్నారు. ఒక వాహ నం ఆగిం దంటే దాని వెనకాల పదుల సంఖ్యలో నిలిచి పోతున్నాయి. ట్రాఫిక్ క్లియర్ కావాలంటే సుమారు అరగంటకు పైనే సమయం పడు తుంది. ట్రాఫిక్ పోలీసులున్నా ప్రయో జనం శూన్యం. లోడింగ్ అయిపో యేంత వరకూ ఉండి తర్వాత వారిచ్చే రూ. వందో రెండు వందలో తీసుకుని వెళ్తున్నట్లు స్థానికులు విమర్శిస్తు న్నారు. ఇది అలవాటుగా మారడంతో సమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు బయటికి వెళ్లిన సమయంలోనే పట్టణంలో లోడింగ్ జరగుతుందని, ఇది మామూలే అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాత్రుళ్లు లోడింగ్ అన్‌లోడింగ్ చేపట్టాలని, అప్పుడే ట్రాఫిక్ సమస్య పరిష్కామ వుతుందని పలువురు పేర్కొం టున్నారు.



ప్రధాన రహదారిలో అడ్డంగా సరుకుల లారీ



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి కోలాకృష్ణన్

రోటరీక్లబ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- జమ్మలమడుగు

రోటరీ క్లబ్ ద్వారా ప్రజలకు ఉపయోగపడే కార్య క్రమాలు చేయడం ఆనందదాయకమని జమ్మలమడుగు డిఎస్పీ కోలాకృష్ణన్ అన్నారు. ఆదివారం స్థానిక డిఎస్పీ కార్యా లయంలో రోటరీక్లబ్ వై. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో డిఎస్పీ కృష్ణన్ రోటరీక్లబ్ ముద్రించిన 2018 నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లా డుతూ సమాజంలో ఎన్నో రకాల మనస్తత్వం కలిగిన వారు ఉన్నారనీ, అందరూ కలిసి మెలిసి ఉండాలని కోరారు. రోటరీ క్లబ్ వారు మతసామరస్యానికి (హిందూ, ముస్లీం, క్రిష్టియన్) సంబంధించిన క్యాలెంటర్ ముద్రించడం హర్షించదగ్గ విషయ మన్నారు. కార్యక్రమంలో రొటేరియన్స్ వి.రాజగోపాల్‌రెడ్డి, వైకుంఠప్రసాదు, కె.నారాయణ, కె.భాస్కర్, వెంకటయ్య, ఫోటో గ్రాఫర్ ప్రసాదు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

కార్యవర్గ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- జమ్మలమడుగు

జమ్మలమడుగు నియోజకవర్గ పిఆర్‌టియు కార్యవర్గ ఎన్నిక నిర్వహించినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్. మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవం గా ఎన్నుకున్నామన్నారు. సమావేశంలో ముద్దనూరు, కొండాపురం, మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగుకు సంబంధించిన ఉపాధ్యాయులు హాజరయ్యారన్నారు. జమ్మల మడుగు మండలశాఖ అధ్యక్షునిగా బి. రామలింగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.రవికుమార్‌ను ఎన్నుకున్నారు. మైలవరం మండలశాఖ అధ్యక్షునిగా వి.శేషాద్రి, ప్రధాన కార్యదర్శిగా యు.మునుస్వామిని ఎన్నుకున్నామని తెలిపారు. పెద్దముడియం మండలానికి సంబంధించి అధ్యక్షునిగా జి.ముని రవీంద్రారెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఎస్.మహ్మద్ హుస్సేన్, ముద్దనూరు మండలశాఖ అధ్యక్షునిగా వై.రిజ్వాన్ అలీ, ప్రధాన కార్యదర్శిగా పి.వేణుగోపాల్‌ను, కొండాపురం మండలశాఖ అధ్యక్షునిగా పి. రఘునాద్‌రెడ్డి, ప్రధాన కార్య దర్శిగా కె.కమలాకర్‌రెడ్డిని ఎన్నుకున్నామన్నారు. కార్య క్రమంలో ఐదు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాల్లో అన్నదానం

ప్రజాశక్తి - కడపఅర్బన్

కాగితాలపెంటలో వెలసిన హజ్రత్ ఖ్వాజా దుఖీ నవాజ్ ఉరుసు ఉత్సవాల్లో భక్తులకు టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు అమీర్‌బాబు అన్నదానం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు కులమతాల కతీతంగా భక్తులు రావడం సంతోషకరమని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, ఆడిటర్ ఖాజామొహి ద్దీన్, డాక్టర్ మహమ్మద్ అన్సారీ గఫూర్, సిఎస్ నాసర్ అలీ, యూసుఫ్ అలీ, ఆసీఫ్, సలీంబాబా పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగులెస్స



విజేతలకు బహుమతి అందజేస్తున్న కళాంజలి

ప్రజాశక్తి - రాజంపేట

దేశ భాషలందూ తెలుగులెస్స అని కళాంజలి సాంస్కృతి సంస్థ అధ్యక్షుడు ఎస్.కళాంజలి అన్నారు. ఆదివారం స్థానిక కాకతీయ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మానసిక వికాశానికి లలిత కళలు అనే వ్యాసరచన పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 73 మంది విద్యార్థులు పాల్గొన్నారని వీరిలో 43 మంది వ్యాసరచన పోటీలు రాశారన్నారు. వ్యాసరచన పోటీలో ఎంపిసి ఫస్ట్ ఇయర్‌కు చెందిన సి.రాజశేఖర్, బిఎస్‌సికి చెందిన హిమబిందు, ఎ.శ్రావణిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అలాగే పి.మల్లిక, భార్గవి, తులసీ, వైష్ణవి, దీపిక, ఆయేషా, సునీత, శ్రీకాంత్, అలేఖ్యలకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. తెలుగు సినిమా పాటల పోటీల విభాగంలో సింగారెడ్డిపల్లెకు చెందిన జి.పెంచలయ్య, తిరుపతికి చెందిన కె.మురళీ, వేంపల్లెకు చెందిన నిత్యపూజయ్య, వీరబల్లికి చెందిన ఎస్.భాస్కర్, హస్తవరంకు చెందిన వైష్ణవి, సుబ్బరాయుడు, నందలూరుకు చెందిన కె.విశ్వేశ్వర ఆచారిలకు కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా రమణారెడ్డి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు కాశివిశ్వనాథ్, వెంకటసుబ్బయ్య, శారదాంబలు న్యాయనిర్ణేతలుగా వ్యవరించారు. కార్యక్రమంలో సత్యవతి, గంగాదేవి, ఎస్. విజయకళ్యాణ్, లక్ష్మీ ఐశ్వరయ్య, నరసారెడ్డిలు పాల్గొన్నారు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - రాజంపేట

మద్యం తాగి వాహనాలు కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం రూరల్ పోలీసుస్టేషన్‌లో పట్టణ, రూరల్ పోలీసులకు నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5 గంటల నుండి సోమవారం ఉదయం వరకు పట్టణ, రూరల్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. ముఖ్యంగా మద్యం సేవించి త్రిబుల్ రైడింగ్, అతివేగంగా వాహనాలు నడపడం, వాహనాలతో విన్యాసాలు చేయడం వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుం దన్నారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకే ప్రధాన కూడలలు, రూరల్ ప్రాంతాలలో పోలీసులతో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రమాదాలను నివారించటానికే ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అర్కెస్ట్రా పెట్టాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు.

కడప నగరంలోని హాస్పిటల్స్

తిరుమల హాస్పిటల్, 7 రోడ్లు	08562 - 222140
భారతి హాస్పిటల్, ఎర్రముక్కపల్లి	08562 - 257089
శ్రీ హాస్పిటల్, ద్వారకానగర్	08562 - 257499
ఉషారాణి హాస్పిటల్, ద్వారకానగర్	08562 - 245098
అరవింద్ కంటి ఆస్పత్రి, ఆర్.కె.నగర్	08562 - 246890
కొమ్మా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి	91000 13357
శ్రీమోహన్ హాస్పిటల్, ఆర్‌టిసి బస్టాండ్	08562 - 246171
సూర్య హాస్పిటల్, మారుతీనగర్	08562 - 251999
తులశమ్మ హాస్పిటల్, నాగరాజుపేట	08562 - 241550
అశ్వని చిన్నపిల్లల హాస్పిటల్, ద్వారకానగర్	98850 16122

నగరపాలక సంస్థ, నగర పంచాయతీ కమిషనర్లు

కడప	చంద్రమౌళీశ్వర్‌రెడ్డి	98499 05862
ప్రొద్దుటూరు	శేషన్న	98499 05863
ఎర్రగుంట్ల	విజయసింహారెడ్డి	90001 03129
పులివెందుల	మధుసూధన్‌రెడ్డి	98665 56180
మైదుకూరు	కృష్ణారెడ్డి	80085 59302
బద్వేలు	శివరామిరెడ్డి	99595 55838
జమ్మలమడుగు	లక్ష్మీరాజ్యం	98499 01670
రాయచోటి	ప్రసాదరాజు	99492 45670
రాజాంపేట	ఎం.వి. రమణారెడ్డి	99890 51971

చికెన్ ధర



చికెన్ స్కిన్‌లెస్ కిలో రూ. 180
చికెన్ విత్ స్కిన్ కిలో : 160



కోడిగుడ్లు డజను
రూ. 43/-

సినిమాలు

రవి : హలో, **సుధ** : అక్సిజన్, **ప్రతాప్** : 2 కంట్రీస్, **రమేష్** : ఎంసిఎ, **మురళి** : ఒక్కక్షణం, **అమీర్** : టైగర్ జిందా హై, **తాహర్** : సప్తగిరి ఎల్ఎల్‌బి, **రాజా(రహత్)** : ప్రోజెక్టు, **ఎస్ఆర్ (సాయిబాబా)**: ఎంసిఎ, **అప్సర** : రాజుగారిగది-2

కూరగాయల ధరలు

రకాలు	కిలో(రూ)
మటిక	20
టమోటా	08
బీన్స్	28
దొండకాయలు	26
క్యారెట్	64
కాలీఫ్లవర్ (ఒకటి)	32
కాకరకాయలు	20
పచ్చిమిర్చి	16
వంకాయలు	12
బెండకాయలు	20
బంగాళదుంపలు	18
చిక్కుడు	24
బీట్రూట్	30
అల్లం (పాతది)	48
అల్లం (కొత్తది)	48
ముల్లంగి	16
బీరకాయలు	20
అలసంద	24
మునగకాయలు (నాలుగు)	10
నిమ్మకాయలు (డజను)	10
కరివేపాకు (కట్ట)	01
కొత్తిమీర (కట్ట)	05
పొదీనా (కట్ట)	06

నగరంలోని పోలీస్ స్టేషన్ల ఫోన్ నెంబర్లు

పోలీస్ కంట్రోల్ రూము	100	గ్రామీణ	9440796907
డీఎస్పీ	9440796904	టుటౌన్	9440796990
వన్‌టౌన్	9440796905	సీసీఎస్	9440796917
చిన్నచౌకు	9440796911	రిమ్స్	9440901823

రైళ్ల రాకపోకల వివరాలు

కడప రైల్వేస్టేషన్ మీదుగా ప్రతిరోజు 19 రైళ్లు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇవి కాక మరో 10రైళ్లు వారానికి ఒకటి, రెండు లేక మూడుసార్లు ఈ రైల్వేస్టేషన్ గుండా వెళ్తుంటాయి. మొత్తంగా 29రైళ్లు వేలాది మంది ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. కడప రైల్వేస్టేషన్ కాలనిర్ణయ పట్టిక ఇదే.

వ. సం	రైలు నెం.	ఏరోజు	నుంచి	వరకు	వచ్చే సమయం	వెళ్లే సమయం
1.	16352	సోమ, శుక్ర	నాగర్‌కోయిల్	ముంబై	00.34	00.35
2.	17652	ప్రతి రోజు	కాచిగూడ	చెన్నయ్,ఎగ్మోర్	00.49	00.50
3.	17420	ప్రతి రోజు	హైదరాబాద్	తిరుపతి	02.44	02.45
4.	16734	గురువారం	ఓఖా	రామేశ్వరం	03.23	03.25
5.	17416	ప్రతి రోజు	కొల్హాపూర్	తిరుపతి	04.20	04.25
6.	11028	ప్రతి రోజు	చెన్నయ్	ముంబై	04.34	04.35
7.	12797	ప్రతి రోజు	కాచిగూడ	చిత్తూరు	04.38	04.40
8.	16382	ప్రతి రోజు	కన్యాకుమారి	ముంబై	06.28	06.30
9.	16351	బుధవారం	ముంబాయి	నాగర్‌కోయిల్	07.18	07.20
10.	12707	సోమ/బుధ/శుక్ర	తిరుపతి	నిజాముద్దీన	07.58	08.00
11.	57274	ప్రతి రోజు	తిరుపతి	హుబ్లీ ప్యాసింజర్	09.13	09.15
12.	11044	ఆదివారం	మధురై	లోకమాన్యతిలక	09.30	09.40
13.	11041	ప్రతి రోజు	ముంబై	చెన్నయ్	10.03	10.05
14	12164	ప్రతి రోజు	చెన్నయ్, ఎగ్మోర్	దాదార్	11.29	11.30
15.	16381	ప్రతి రోజు	ముంబై	కన్యాకుమారి	11.33	11.35
16.	16733	శనివారం	రామేశ్వరం	ఓఖా	13.53	13.55
17	12163	ప్రతి రోజు	దాదార్	చెన్నయ్, ఎగ్మోర్	14.08	14.10
18	07606	మంగళవారం	కాచిగూడ	మంగళూరు	14.41	14.42
19	56012	ప్రతి రోజు	కడప	అరక్కోణం	13.45	14.35
20	07675	గురువారం	మంగళూరు	కాచిగూడ	15.22	15.23
21	11042	ప్రతిరోజు	చెన్నయ్	ముంబై	17.04	17.05
22.	57273	ప్రతిరోజు	హుబ్లీ	తిరుపతి(ప్యాసింజరు)	17.04	17.05
23.	12708	సోమ/గురు/శని	నిజామొద్దీన్	తిరుపతి	18.33	18.35
24.	17430	ప్రతి రోజు	తిరుపతి	హైదరాబాదు	19.00	19.05
25.	11043	శుక్రవారం	లోకమాన్యతిలక్	మధురై	19.33	19.35
26	12798	ప్రతి రోజు	చిత్తూరు	కాచిగూడ (వెంకటాద్రి)	21.08	21.10
27	11027	ప్రతి రోజు	ముంబై	చెన్నయ్(మెయిల్)	21.33	21.35
28.	17651	ప్రతి రోజు	చెన్నయ్, ఎగ్మోర్	కాచిగూడ	22.14	22.15
29.	17415	ప్రతి రోజు	తిరుపతి	కోల్హాపూర్(హరిప్రియ)	23.38	23.40

కడప రైల్వేస్టేషన్ విచారణ కేంద్రం నెం. 08562-242131

కడప నుంచి ప్రధాన నగరాలకు వెళ్లే బస్సుల వేళలు

జిల్లా కేంద్రమైన కడప నుంచి రోజూ హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నయ్, శ్రీశైలం, నెల్లూరు, అనంతపురం, కర్నూలు ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయపాలన వివరాలు ఇలా...

బస్సు	సమయం
హైదరాబాదు	
డీలక్స్	06.15
సూపర్ లగ్జరీ	08.30
సూపర్ లగ్జరీ	09.30
సూపర్ లగ్జరీ	10.30
సూపర్ లగ్జరీ	11.30
ఎక్స్‌ప్రెస్	14.30
సూపర్ లగ్జరీ	20.00
సూపర్ లగ్జరీ(బిహెచ్ఇఎల్)	20.30
సూపర్ లగ్జరీ (కెపిహెచ్‌బి)	21.00
సూపర్ లగ్జరీ (జెడిఎంటి)	21.30
సూపర్ లగ్జరీ (ఇసీఐఎల్)	22.00
ఇంద్ర	22.30
సూపర్‌లగ్జరీ	22.45
బెంగుళూరు	
సూపర్ లగ్జరీ	00.30
ఎక్స్‌ప్రెస్	04.30
ఎక్స్‌ప్రెస్	07.00
సూపర్ లగ్జరీ	07.40
సూపర్ లగ్జరీ	08.30
ఇంద్ర	10.30
సూపర్ లగ్జరీ	11.30
డీలక్స్	14.30
సూపర్ లగ్జరీ	20.15
సూపర్ లగ్జరీ	22.00
సూపర్ లగ్జరీ	22.15
సూపర్ లగ్జరీ	22.30
సూపర్ లగ్జరీ	22.45
సూపర్ లగ్జరీ	23.00
ఇంద్ర	23.30
విజయవాడ	
సూపర్ లగ్జరీ	08.00
సూపర్ లగ్జరీ	09.00
సూపర్ లగ్జరీ	10.30
సూపర్ లగ్జరీ	18.30
సూపర్ లగ్జరీ	20.00
ఇంద్ర	21.00
సూపర్ లగ్జరీ	21.30
సూపర్ లగ్జరీ	22.00
ఇంద్ర	22.15
చెన్నయ్	
సూపర్ లగ్జరీ	08.40
సూపర్ లగ్జరీ	11.30
సూపర్ లగ్జరీ	21.30
సూపర్ లగ్జరీ	22.30
సూపర్ లగ్జరీ	23.30

- **కడప నుంచి శ్రీశైలంకు ఎక్స్‌ప్రెస్ ఉదయం 5.30, మధ్యాహ్నం 13.30 గంటలకు**
- **కడప నుంచి నెల్లూరు :** ఉదయం 4,00, 5.00, 6.00, 6.30, 7.00, 8.00, 8.30, 9.15, 10.00, 10.30, 11.00, 11.30, మధ్యాహ్నం 12.30, 1.30, 2.00, 2.30, 3.00, 3.30, 4.00, 4.30, 5.00, సాయంత్రం 6.00, 6.30గంటలకు
- **అనంతపురం :** ఉదయం 4.30, 5.00, 5.30, 6.30, 7.00, 8.00, 8.40, 9.00, 9.45, 10.25, 10.45, 11.15, 11.30, మధ్యాహ్నం 12.00, 12.20, 1.00, 1.30, 2.00, 2.15, 2.20, 3.15, 3.30, 4.30, సాయంత్రం 5.00, 5.15, 6.30, 7.30
- **కడప నుంచి కర్నూలు :** అర్ధరాత్రి 12.30, 12.45, 1.00, 1.30, 1.45, 2.00, 2.15, 2.45, 3.00, 3.20, 3.30, 3.45, ఉదయం 4.00, 4.30, 5.30, 6.00, 7.30, 8.00, 8.45, 9.00, 9.45, 10.00, 10.30, 10.45, 11.15, 11.30, 11.45, మధ్యాహ్నం 12.00, 12.30, 1.00, 1.20, 1.45, 2.00, 2.30, 3.30, 4.00, 4.30, 5.00, 5.30, రాత్రి 11.15. 11.35

విచారణ కేంద్రం ఫోన్ నెంబరు 08562-244160

'మురికి నీటి' కెసి కెనాల్

- చెరువులోకి చేరుతున్న చెత్త, చెదారాలు
- చిట్టచివరి ఆయకుట్టు రైతుల్లో ఆందోళన
- పట్టించుకోని కెనాల్, కార్పొరేషన్ అధికారులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కెసి కెనాల్ నీరు కార్పొరేషన్ పరిధిలోకి ప్రవేసిస్తూనే మురికినీరు ఇందులో కలిసిపోతుంది. ఈ నీరు పాతకడప చెరువులోకి చేరి కంపుకొడుతూ ఉన్నాయి. 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెవురువు కింద మూడువేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. పాతకడప, మోడమీదపల్లె, దేవుని కడప, ఉక్కాయపల్లె, పాలెంపల్లె, సాయిపేట, వాటర్‌గండి వరకు నీరు వెళుతుంది. 20 వేల మంది వ్యవసాయకూలీలు దీనిపై ఆధారపడి ఉన్నారు. నగరంలోని కెసి కెనాల్ ఇరువైపులా నివశించే ప్రజలు ఇళ్లలోని చెత్తా, చదారం, ప్లాస్టిక్ కవర్లు, మురుగునీరు కాలువలోకి వదలడంతో నీటి ప్రవాహం సక్రమంగా సాగడంలేదు. కెనాల్ మూసుకుపోయి చెరువుకు, ఉక్కాయపల్లె రైతులకు నీరు తక్కువగా అందుతోంది. కెసి కెనాల్‌లో వ్యర్ధపదార్థా లను, పూడికను తొలగించాల్సిన బాధ్యత కార్పొరేషన్ అధికారులపై ఉంది. అదేక్రమంలో కెసికెనాల్ అధికారులు జోక్యం చేసుకుని రైతుల ప్రయోజనాలు కాపాడాల్సి ఉంది. రెండు శాఖల అధికా రులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కెసి నీరులో మురికినీరు చేరడంతో నీరు కలుషితమై వేసిన పంటలకు చీడపీడ పట్టడం, పంటల ద్వారా వచ్చిన దిగుబడి పదార్థాలు తినడం వల్ల రైతులు, ప్రజలు తీవ్రమైన జబ్బులకు గురవుతున్నారు. మురికినీరు చెరువులోకి చేరడంవల్ల నాలుగు అడ్డుల వరకు మురికి ఒండ్రు పేరుకు పోయింది. అధికారులు వెంటనే స్పందించి యుద్ధప్రాతి పదికన చెరువు, కెసి కెనాల్‌ను శుభ్రం చేసి చివరి ఆయకట్టు రైతుల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉంది. కెసి కెనాల్‌కు ఇరువైపులా ఉన్న ప్రజలు కాలువలో చెత్త వేయకుండా కార్పొరేషన్ వారు డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నీరు-చెట్టు పథకం ద్వారా గాని, కార్పొరేషన్ ద్వారాగాని మట్టిని తొలగించాలి. చెరువు వద్ద తూములు పచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతోనీరు రైతులకు చేరే అవకాశాలు మృగ్యమయ్యాయి. కెసి కెనాల్లో గుర్రపుడెక్క పెద్దఎత్తునా పేరుకుపోయింది. నీటి ప్రవాహాన్ని ఆపివేస్తుంది. అధికారులు స్పందించకపో తే చెరువుకు, చివరి ఆయకట్టుదారులకు నీరు వచ్చే అవకాశం పూర్తిగా సన్నగిల్లిపోతుంది. రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు తాగు, సాగునీటికి ఇబ్బంది పడే ప్రమాదం ఏర్పడుతుంది.

గుర్రపుడెక్కతో నిండిపోయిన కెసి కెనాల్ కాలువ





చెత్త, చెదారంతో నిండిన పాత కడప చెరువు

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

గండికోట జలాశయ ప్రాజెక్టు కింద ముంపునకు గురైన గ్రామాల్లోని అర్హులైన ప్రజలకు పరిహారం చెల్లించకుండా అనర్హులకు కోట్లు కట్టబెట్టి అవినీతికి పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి శివకుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముద్దనూరు, కొండాపురం మండలాలకు 15కు పైగా పంచాయతీలు గండికోట ప్రాజెక్టులో ముంపు ఎదుర్కొంటున్నారని వారందరికీ న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొండాపురం మండలంలో అర్హులైన లబ్ధిదారులు పరిహారం కోసం కాళ్లు అరిగేలా తిరుగుతుంటే అనర్హులు దర్జాగా ఉన్నారన్నారు. అవినీతి విషయంలో ప్రభుత్వం కొంత మంది అధికారులపై చర్యలు తీసుకున్నప్పటికీ గ్రామ స్థాయిలో అవినీతికిపాల్పడిన రెవెన్యూ అధికారులను వదిలేశా రన్నారు. ముద్దనూరు మండలంలో మరికొన్ని ముంపు వల్ల నష్టపోయిన వారికి న్యాయం చేయాలన్నారు. పరిహారం చెల్లించే విషయంలో రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్ప డ్డారని చెప్పారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి న్యాయం చేయాలన్నారు. డివైఎఫ్ఐ కొండాపురం ముంపు ప్రాంతాల్లో పర్యటించి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామన్నారు. పునరావాస ప్రాంతాల్లో నిరుద్యోగయువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



నృత్య ప్రదర్శనలో వెంకట్

విశాఖ ఉత్సవ్‌లో అలరించిన వెంకట్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరుకు చెందిన మానసిక వికలాంగుడు వెంకట్ విశాఖ ఉత్సవ్‌లో తన సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా సభికులను అలరించారు. ఈ సందర్భంగా వెంకట్ తల్లి విశాలాక్షి స్థానిక విలేకరులతో ఆదివారం ఫోన్ ద్వారా మాట్లాడారు. విశాఖపట్టణంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. వెంకట్ గానం, నృత్యం, లిప్‌మూవ్‌మెంట్ వంటి అంశాలలో ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. మానసిక వైకల్యంతో పుట్టిన వెంకట్‌ను సమాజం గర్వించే విధంగా తీర్చిదిద్దాలనే ఆశయంతో వెంకట్ తల్లిదండ్రులు విశాలాక్షి, రాధాకృష్ణ ఎంతోకష్టపడి పలు విద్యలు నేర్పించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఎక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్న అక్కడికి హాజరై తన ప్రతిభను వెంకట్ చాటుతున్నారు. విశాఖ ఉత్సవ్‌లో వెంకట్ ప్రతిభకు మెచ్చి కేంద్ర మంత్రి సుజన చౌదరి, రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసరావు, పత్తిపాటి పుల్లారావు, కామినేని శ్రీనివాస్, ఎంపి హరిబాబు ప్రశంసించినట్లు విశాలాక్షి తెలిపారు.

పలువురు 'అపస్'లో చేరిక

కడపఅర్బన్ :

ఎపిటిఎఫ్‌కు చెందిన ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్)లో చేరారు. ఆదివారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎపిటిఎఫ్ మాజీ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, బాలానాయుడు, రామక్రిష్ణారెడ్డి, పరబ్రహ్మారెడ్డి నాయకత్వంలో అపస్ ఆశయాలు, విధానాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై వందమంది కార్యకర్తలు చేరారని పేర్కొన్నారు. ఆపస్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

హాలుని గాథా సప్తశతి తొలి విజ్ఞాన సర్వస్వం

ప్రజాశక్తి - కడపఅర్బన్

హాల శాతవాహన చక్రవర్తి రచించిన గాథా సప్తశతిని తొలి విజ్ఞాన సర్వస్వంగా అభివర్ణించారని కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత, ప్రముఖ కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆదివారం సిపి భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ అనుపాటి సుబ్బరాయుడు రచించిన 'గాథాసప్తశతి- సౌందర్య గాథ' అనే సిద్ధాంత గ్రంథం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గాథా సప్తశతిపై పరిశోధనలకు పూనుకొని ప్రతి ప్రాకృతి కవి హృదయాన్ని విప్పి చదివి అంతరంగాన్ని సౌందర్యదృష్టిలో బహిరంగం చేసే ప్రయత్నం చేశారన్నారు. గ్రంథాన్ని పాఠకుల అభిరుచికి అనువుగా తీర్చిదిద్దడం ప్రశంసనీయమని చెప్పారు.సభకు అధ్యక్షత వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి శతాబ్దం పూర్వభాగంలోనే హాలుడు ప్రాకృత భాషలోని 700 సుందర గాథలను ఏర్చికూర్చి గాథా సప్తశతి పేరిట సంకలనం చేశారని పేర్కొన్నారు. మహాభారతానికి ఎన్ని విశిష్ట లక్షణాలు ఉన్నాయో వాటిని గాథాసప్తశతికి పొందుపరచడం అభినందనీయమన్నారు. ఇది తెలుగువారి గ్రామీణ జీవన భారతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ జి.వి. సాయిప్రసాద్, కోటేశ్వరరావు, సిపి బ్రౌన్ పరిశోధన కేంద్రం బాధ్యులు డాక్టర్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

కొత్త ఏడాది కేకుల సందడి

ప్రజాశక్తి - చెన్నూరు

ఆదివారం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువకులు కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచుకొని సందడి చేశారు. స్థానిక కొత్తరోడ్డులోని స్వీట్ల దుకాణం వద్ద అధిక సంఖ్యలో కేకులు, స్వీట్లు కొనుగోలు చేస్తూ యువకులు కనిపించారు. వ్యాపారాలు కాస్త మందగించినా వేడుకలు చేసేందుకు యువకులు, మహిళలు సైతం ఆసక్తి కనపరిచారు. పెద్ద మొత్తంలో కేకు విక్రయాలు చేశారు.

రేపటి నుండి జన్మభూమి - మా ఊరు



మాట్లాడుతున్న రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 5వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు పట్టణ పరిధిలో మొదలవుతాయని మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి , కమిషనర్ బండి శేషన్న తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనవరి 2 నుంచి 11 వరకు జన్మభూమి కార్యక్రమాలను నిర్వహిస్తా మన్నారు. సంక్షేమం, వైద్యం, స్వచ్ఛాంధ్ర, విద్య, మౌళిక వసతులు, సహజ వనరులు, వ్యవసాయం, సాంకేతికత, స్వావలంభన, సాంస్కృతికం అంశాలతో కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన వారందరికీ ఫించన్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. వ్యక్తిగల సామాజిక అవసరాల కోసం జన్మభూమి కార్యక్రమంలో అర్హులైన వారు అర్జీలను దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మున్సిపల్ పరిధిలో గత జన్మభూమిలో వచ్చిన 56అర్జీలను పరిష్కరించామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కాపుకార్పోరేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కాపు (బలిజ) కార్పోరేషన్ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను బలిజలు సద్వినియోగం చేసుకోవాలని అఖిల భారత కాపుసమాఖ్య జిల్లా అధ్యక్షుడు పాశం లక్ష్మినర్సయ్య తెలిపారు. అఖిల భారత కాపు సమాఖ్య ప్రొద్దుటూరు బలిజ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బలిజ సంఘం కార్యాలయంలో ఆదివారం 2018 క్యాలెండర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి కాపు రుణాలు అందజేస్తారని చెప్పారు. పేద బలిజ విద్యార్థులు స్కాలర్‌షిప్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉండేల శ్రీను, జిల్లా యూత్‌అధ్యక్షుడు నరసింహ, ఉపా ధ్యక్షులు శ్రీదేవి, కార్యదర్శి సుదర్శన్, రామ్మోహన్, చంద్రశేఖర్, వెంకటపతి, రవి, వీర, ముద్దం రమణ, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.



క్యాలెండరు ఆవిష్కస్తున్న బలిజ సంఘం నాయకులు

అవార్డులు అభినందనీయం

ప్రజాశక్తి - కడపఅర్బన్

పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులను ప్రోత్సహించే సంకల్పంతో అవార్డు కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్‌పి బాబూజీఅట్టాడ పేర్కొన్నారు. ఆదివారం అవార్డులు ఇస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో తారీక్‌అలీ, అస్రఫ్ అలీఖాన్, అబూబకర్‌సిద్ధిక్, తన్వీర్ పాల్గొన్నారు.

రాయలసీమను సస్యశ్యామలం చేయడమే ముఖ్యమంత్రి లక్ష్యం : పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాయలసీమను సస్యశ్యామలం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం స్తానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ, జిల్లా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ముందుకు పోతున్నారన్నారు. జనవరి 2వతేది నుంచి 5వ విడత జన్మ భూమి - మాఊరు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహిస్తున్నా రన్నారు. ఈ సందర్భంగా అర్హులకు పెన్షన్, వసతి గృహం, ఉచిత ఇంటి స్థలం మంజూరు చేస్తారన్నారు. రాష్ట్రంలో సాగు, తాగునీటి సమస్యలను పూర్తిగా రూపుమాపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మైలవరం ప్రాజెక్టులో 6.36 టిఎంసిలు, వామికొండ 0.05 టిఎంసిలు, సర్వరాయసాగర్‌లో 0.01 టిఎంసిలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ జలయజ్ఞమే ధనయజ్ఞంగా భావించి ప్రాజెక్టులకు మధ్యలోనే నిలుపుదల చేస్తే ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం వాటిని పూర్తి చేస్తోందని ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అధి కారం కోసమే జగన్ పాదయాత్ర చేస్తున్నాడని ప్రజలు చర్చించు కుంటున్నారని చెప్పారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి, గండికోట ప్రాజెక్టు నుంచి చిత్రావతికి నీరు వదిలితే నీటి పరీవాహ ప్రాంతాల వారి తాగునీరు సమస్య తీరుతుందని అన్నారు. ఎస్‌ఆర్‌బిసిని 2018లో పూర్తి చేయడానికి ముఖ్యమంత్రితో చర్చించి కృషి చేస్తామన్నారు. ఇది పూర్తి కావడానికి రూ.150కోట్లు అవసరం అవుతుందన్నారు. ఈ రోజు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు 24గంటలు విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలల్లో భాగంగా చంద్రన్నబీమా, ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ, హిజ్రాలకు పెన్షన్, ఇళ్ళ స్థలాలు, మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.గిరిధర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంభాపురం వెంకటరమణారెడ్డి, పొన్నతోట శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి. రామసుబ్బారెడ్డి

రాజధానికి రైలు నడపాలని రాస్తారోకో

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తిరుపతి నుండి ప్రొద్దుటూరు మీదుగా అమరావతి రాజధానికి రైలు నడపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. ఈమేరకు సిపిఎం కార్యకర్తలతో కలిసి ఆదివారం స్తానిక రైల్వే గేటు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ప్రొద్దుటూరు పేరు పొందిందనీ, ఇక్కడి నుంచి పలురకాల వ్యాపారస్థులు, విద్యార్థులు రాజధానికి వెళ్తుంటారని, అందరి సౌకర్యార్థం ప్రొద్దుటూరు మీదుగా రాజధానికి రైలు నడపాలని అన్నారు. ప్రొద్దుటూరు నుంచి నేరుగా రాజధానికి రైలు సౌకర్యం లేకపోవడం వల్ల యర్రగుంట్లకు వెళ్ళి అక్కడ నుండి తిరుపతి మీదుగా విజయవాడకు వెళుతున్నారని తెలిపారు. కొంతమంది నంద్యాలకు వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇక్కడ నుంచి రాజధానికి రైలును ఏర్పాటు చేస్తే ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కోవెలకుంట్ల, బన గానపల్లె ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాజధానికి రైలు నడపాలని ఇప్పటికీ పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఫక్కీరయ్య, మహబూబ్ వల్లి, బాలరాజు, ఆటో యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి రమేష్, సిపిఎం నాయకులు సుబ్బారావు, చెన్నారెడ్డి, హరి, రమేష్, ఓబులేసు, అబ్దుల్, మురళీ, ఇర్షాద్, కేశవ, అరుణ్, ధనుష్, వంశీ, చందు పాల్గొన్నారు.


సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న ప్రజలు